

దార్ల మాట తేటగీతి శతకం



దార్ల వెంకటేశ్వరరావు


దార్ల మాట తేటగీతి శతకం
దార్ల వెంకటేశ్వరరావు

'DARLA MATA' TETAGEETI SATAKAM

By
DARLA VENKATESWARA RAO
Professor & Former Head, Department of Telugu,
School of Humanities,
UNIVERSITY OF HYDERABAD,
(Central University), Hyderabad,
Telangana, India

First Edition : March, 2026

Boos Available at:
https://archive.org
www.vrdarla.blogspot.com

FOR COMMUNICATION:
B 202, Sai Cluster Apartment,
Sivajinagar Colony,
Near Lingampally Railway Station,
Opp: Bharat Petrol Bunk, Seri Lingampally,
Hyderabad -500 019.
Ph: 9989628049,
E mail: darlahcu@gmail.com

Cover Design : **D. Sainath Reddy**

Digitally Published by:
Manjusree Publications
Hyderabad

ప్రస్తావన

తెలుగు సాహిత్యంలో ‘శతకం’ అనేది సామాన్యుడికి కూడా చేరువైన ఒక అద్భుతమైన కవిత్వ ప్రక్రియ. మకుటం అనే ఆయుధంతో సామాజిక సత్యాలను, నైతిక విలువలను సూటిగా చెప్పడానికి ఈ ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుంది. ఆ కోవలోనే నా అంతరంగంలో మెదిలే భావాలను ఆవిష్కరించే ప్రయత్నమే ఈ ‘దార్ల మాట’ తేటగీతి శతకం. అయితే, ఈ శతకాన్ని రాయాడానికి, పద్యాలను రాయడానికి ఎంతో నేపథ్యం ఉంది. జూన్, 2021లో ‘దారి పూల తోట దార్ల మాట’ పేరుతో ఆట వెలది ఛందస్సులో ఒక శతకం రాశాను. దాన్ని ప్రచురించేముందు శంకరాభరణం గ్రూపు ద్వారా పద్యాలను రాయించే ఆసక్తిని పెంపొందించే కంది శంకరయ్యగారి వలన పద్యాలు రాయాలనే ఆలోచన వచ్చింది. ఆ గ్రూపుని పరిచయం చేసిన వారు మా మిత్రుడు గోవిందు గోవర్ధన్. అప్పుడు రాసిన పద్యాలను ఆయనకు పంపడం వాటిని చూసి కొన్ని సలహాలు ఇవ్వడం, అలా పద్యాలు రాయాలనే ఆసక్తి పెరిగింది. సుమారు 200 పైగా పద్యాలు రాసినప్పటికీ కొన్ని పద్యాలు మాత్రమే వేసాను. ఆ తర్వాత నుండి రకరకాల అంశాలపై పద్యాలను రాస్తుండే వాడిని.

నా జీవిత ప్రయాణంలో నేను చూసిన మనుషులు, నేను పొందిన వివిధ అనుభవాలు, నా అక్షరానికి ఊపిరి పోసిన నా తల్లిదండ్రులు శ్రీమతి పెదనాగమ్మ, శ్రీ లంకయ్య గార్ల జ్ఞాపకాలు ఈ పద్యాలకు మూలబిందువులు. వారిని వర్ణించేప్రయత్నం కూడా చేశాను.

సీ. తాతయు చదివెను కావమ్మ కథలన్ని
బాలనాగమ్మను బహుగ చదువ
కమ్మనిభారతరామాయణాదులు
చెప్పి మమ్ములను మెప్పించు తాత
నాన్నబడికిపోక కష్టమే దక్కెను
విద్య రాకున్నను విలువ లిచ్చె
కొడుకులు కూతురు కొత్తవృత్తులుజేయ
నేర్పుమీ రగగాను మార్పు తెచ్చె

తే.గీ.

తాత నేర్పిన విద్యను తలను దాల్చి
మొవ్వ పురుగును తీయుట మొదటనేర్చు
వృక్ష రాజును కాపాడు శిక్షణవలె
తనయులందరికిని మంచి దారి చూపె!

సీ.

ప్రొద్దునే పని కెళ్ళి ప్రొద్దు వాటము లోన
 వేల ఆకుల గొట్టు వీరుడతడు
వందతా టాకులకొక్కరూకమినిచ్చు
 కాలమ్ము లోనను కత్తిపట్టి
మూడువేలాకులు ముచ్చటగాకొట్టి
 మధ్యాహ్న వేళకు మరలివచ్చె
కష్టాన్ని చూడగా కనులార మేమెన్నొ
 మరవురానివి కదా బాల్య స్మృతులు

తే.గీ.

నేడు పదిమంది గొప్పగ చెప్పుకొనగ
వింటి నాన్నకీర్తికథల వెలుగు లెన్నొ
రెక్కలాడిననాడెమాడొక్కనిండు
రోజులందునే సువిశాలలోగిలిచ్చె.

సీ.

నలుగురు కొడుకులు నవ యువకులు నేడు
 ఉన్నత పదవుల ఉన్నవారె
ముగ్గురు కోడళ్ళు ముదముగా టీచర్లు
 చెల్లియు టీచరై జెంతనుండె
అల్లుడు టీచరై హాయిగా బ్రతికేను
 సంతృప్తి నిచ్చె సంసారమంత

సెంటు భూమియు లేని చెప్పుకొనగనైన
 సృష్టి జేసెను కదా కష్టపడుచు.

తే.గీ.

బిడ్డ లందరి పెళ్ళిళ్ళు పెద్ద జేసి
కళ్ల నిండుగ చూసెను కమ్మనైన
కష్ట జీవికి దక్కిన కానుకవగ
నాన్న కీర్తిని చాటెద కవనమందు

చదువుల తల్లిని ఒక ప్రతీకాత్మకంగా సరస్వతీమాతగా మన పూర్వీకులు ఒక భావనను ఏర్పరిచారు. చదువుకుంటే మంచిచెడులను తెలుసుకుంటారు. కనుక, పాలునీ, నీటినీ వేరుచేయగల శక్తి హంసకు ఉంటుందనీ, హంసను సరస్వతీమాతకు వాహనంగా భావిస్తారు. అటువంటి సరస్వతీమాతపై ప్రతికవి ఏదొక సందర్భంలో పద్యాలు వర్ణించినవారే. సరస్వతీమాతపై పోతన పద్యాలు ఆణిముత్యాలు. అటువంటి పద్యాలు రాయాలంటే ఎంతో సాధన కావాలి. తొలిమాట అమ్మ అని ఎలా పిలుస్తామో, అది ఎలా ఉన్నా అది అందమే. అలాగే, సరస్వతీమాతపై నేను కొన్ని పద్యాలు రాసుకున్నాను.

ఆ.వె.

మావి చిగురుదొడిగె! మలయాద్రి పవనాల
కోయిలమ్మ పాడె కుహుకుహుమని!
చదువులమ్మవీవు జగతివిద్యనొసగ!
బ్రతుకు బాటనిలుపు!భారతీమ!

తే.గీ.

తెల్ల పద్మము నందున తెలివితోడ
వీణ మీటుచు కొలువైన వేదమాత!
జ్ఞాన భిక్షను కోరెడి జనులకెల్ల
దీవెనలనంద జేయుము దివ్యముగను!

ఆ.వె.

ధనము దోచబడును!విద్య దోచగలేరు!
తరగిపోని ధనమె తనదువిద్య!
విద్యనొసగుతల్లివి! వసుధ జనులకెల్ల!
శారదాంబ! నిన్ను సన్నుతింతు!

తే.గీ.

మంచి బుద్ధిని మాకిచ్చి మమ్ముగాచు!
ధారణాశక్తి నందించి దారిజూపు!
విద్యలందున బోధనావెలుగు నీవె!
విశ్వ ప్రగతికి విద్యలె వేదికగును!

తే.గీ.

పసిడి వర్ణపు కాంతుల పట్టమహిషి!
వీణనొకచేత ధరియించు విరులబోణి!
పుస్తకము నొకచేతియందు పొందు పరచి
వాక్కులమ్మగ!విద్యల వాణినీవె!

తే.గీ.

కుంద గౌరవ దేహటరీజ్జుల గుణశీల!
పుస్తకము చేత బూనిన పూజ్యురాల!
మందహాసము తోడను మమ్ము గాచి
జ్ఞాన మార్గము జూపుము శారదాంబ!

మా కుటుంబాన్నీ అనేక పద్యాలలో వర్ణించిన 'కవికోకిల' డా.జె.వి.చలపతిరావుగార్కి కృతజ్ఞతలతో కొన్ని పద్యాలు రాశాను.

తే.గీ.

కలిమి కంటెను కవితయే కవుల గుణము!
వెలుగు కంటెను దీవెనల్ వేల్పు మాకు!
ధన్యమగు మాదు గుణములే ధరణి నిలచు!
పరమ వాత్సల్య రసములై ప్రబలు నార్య!

తే.గీ.

ఉప్పు కప్పురమును బోలు నొప్పు గుణము!
కవుల కనులకె వెలుగులు కలుగు నయ్య!
మేము చేసిన పుణ్యమా! మీదు రచన!
మీదు గుణములే యక్షర మెరపులార్య

తే.గీ.

కల్ప వృక్షము నీడన కలిమి కలుగు
కామధేనువు చెంతను కరువు లేదు
యటులె మీ పద్య దీవనల్ మాకు దొరికె
చలపతియె మమ్ము నిరతము చక్కదీర్చె!

తే.గీ.

మల్లె పూవుల తావియే మహినిదాక
బిరుదమది కవికోకిల పెంపుమీర!
శ్రీనివాసుని కృపయది సిద్ధినొసగె!
చలపతియె మాకు దొరికిన చతురమతియు!

తే.గీ.

కవికి మించిన దాతయు కాన రాదు!
దీవనలనిచ్చు గురువుకు ధీటు లేరు!
చలపతికి మేము మ్రొక్కెద విలసితముగ!
నక్షరమ్ముల దీవించె నార్యవర్య!

శుభోదయాన్ని వర్ణించడం, సమకాలీన అంశాలపై దృష్టి పెట్టడం, నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరంపైనా, భాగమతి ప్రణయం మీదు, ప్రత్యేకించి గుర్రం జాషువ గారి పద్యాల ప్రేరణతో కవి గొప్పతనాన్ని వర్ణించాలనుకొని కొన్ని పద్యాలు రాశాను.

తే.గీ.

భాగ్యనగరపు వీధుల భవ్యకళలు
చార్మినారుల గోపుర సౌష్ఠవములు
మూసితీరపు టందాల ముచ్చటలును
తెనుగు సంస్కృతి నిలిపెను దివ్యముగను!

తే.గీ.

మతములేవైన మనుషులు మమతతోడ
కలిసి మెలిసియునుందురు క్రమగతిని
గంగ జమునల కలయిక గతుల మాడ్కి
నిఖిల లోకాన నిలుచును నిచ్చలముగ!

తే.గీ.

ఆప్తు లందరి చుట్టము లట్లు జూచు
కడుపు నిండాను ప్రేమతో గారవించు
తీపి మాటల తహజీబు తెలుగు బాస
భాగ్యనగరపు సొగసమ్మ పసిడి వన్నె!

తే.గీ.

కోట గొల్కొండ బురుజుల గొప్పదనము
కరము తట్టిన వినిపించు కంచు రవము

ప్రాచ్య విజ్ఞాన సంపద ప్రబలి యుండు
శిల్ప సౌందర్య రాశియై చెలువు మీరు!

తే.గీ.

పాత కోటల నీడలో పసిడి కలలు
సాఫ్టువేరుల మెరుపుల చదువు తళుకు
విశ్వ విఖ్యాత నగరమై వెలుగులీను
మనదు హైదరాబాదును మరువలేము!

తే.గీ.

గాలి పటముగా సాగెడి గతుల తోడ
నింగి దారుల మెట్రోలు నీటు గాను
కాల వేగము గెలిచెడి కాంతి వలెను
పయన మొనరించు ప్రజలకు పరమ సుఖము!

తే.గీ.

సాగరముమధ్య బుద్ధుని శాంతి రూపు
రత్నదీపాల వెలుగుల రమ్య వెలుగు
చుట్టు తిరిగేటి దారుల సొగసులన్ని
చిత్రకారుని కుంచెలో చిత్రలేఖ!

భాగ్యనగర ఆవిర్భావానికి మూలకారణమైన కులీకుతుబ్ షా–భాగమతిల చారిత్రక ప్రణయ గాథను కొన్ని తేటగీతి పద్యాలలో వర్ణించాను. ఈనాడు హైదరాబాదు నగరం భారతదేశానికి ప్రతీకగా కనిపిస్తుంది. అందుకే కొన్ని పద్యాలు వర్ణించాలనిపించింది,

తే.గీ.

రాజ్యభోగము లేలనో రమ్యమగును?
భాగమతి లేని జీవిత బాట లేని
పయనమగునని తలచెను ప్రాణవిభుడు
విరహతాపమునను వేగె వికలమతిని!

తే.గీ.

పొంగి పొర్లెడి మూసిని పొలుపు తోడ
గుఱ్ఱ మెక్కియు దూకెను గుండె బలము
ప్రాణ భయమును వీడెను ప్రణయ మొకటె
సాహ సముజేసి చేరెను సఖిని జూడ!

తే.గీ.

తనయు ప్రేమను గాంచెను తండ్రి యచట
నిశ్చలము నైన బంధము నిఖిల మెరుగ
కులము మతమును చూడక కోర్కె తోడ
పెళ్ళి జరిపెను వేడుకల్ పృథివి మెచ్చ!

తే.గీ.

భాగమతి పైన గల్గిన పరమ ప్రీతి
కట్టె నగరమ్ము నిచ్చట గర్వ మొలక
భాగ్యనగరమ్ము నను పేర బ్రబలి యుండ
నిలిచె చారిత్రకము గాను నేటి కిలలో!

తే.గీ.

నాల్గు స్తంభాల నడుమను నవ్వు లొలికి
చార్మి నారుల సాక్షిగ సాగె ప్రేమ
జంట మనసుల కలయిక వింత గొలిపి
నిలిచి పోయెను లోకాన నిరుపమముగ!

తే.గీ.

హైదరున్ మహలుగ మారె నతివ పేరె
భాగ్యనగరమ్ము మారెను భాసిలగను
హైదరాబాదు పేరను హాయి గొలిపి
విశ్వవిఖ్యాత నగరమై వెలుగు లీను!

తే.గీ.

రాజు లేగిరి కోటలు రాలిపోయె
మిగిలి యున్నది ప్రణయము మేటి గాను
గాథ లన్నియు చాటును కమ్మనైన
ప్రేమ జంటల చరితలు పృథివి పైన!

నేను పాఠం చెప్పే సాహిత్య విమర్శకు సంబంధించినవీ, అలంకార శాస్త్రానికి సంబంధించినవీ కొన్ని పద్యాలు రాశాను...తల్లిదండ్రులు అనుబంధం, కుటుంబ గొప్పతనం, ప్రేయసీ ప్రియుల మధ్య ఉండే అనుబంధాన్ని...ఇలా ఒకటి రెండేసి పద్యాలు వర్ణించుకునేవాడిని. కానీ వాటిని ఎవ్వరికీ చూపించేవాడిని కాదు. ఆంధ్రమహాభారతం, ఆంధ్ర మహాభాగవతం, ప్రబంధాలు చదివేటప్పుడు ఆ కవుల పట్ల అత్యంత గౌరవం పెరగడంతో పాటు, ఆ పద్యాలు చదివిన తర్వాత నా పద్యాలు చూసుకొని నేను మురిసిపోవడం తప్ప, బయట పెట్టాలంటే ఒక భయం కూడా కలిగేది.

శుభోదయ వర్ణన:

కం.

కైతయు కత్తుల కన్నను
రీతిని మార్చును జగతిని ప్రీతిని నింపున్
ఖ్యాతిని నింపెడు గురువవు
నీతిని నేర్పగ వలెనిక నిత్యము దార్లా!

కం.

ముదమున భానుడు వెలిగెను
కదనము గెలిచిన విభుడుగ కౌతుక మొలికెన్
వదనము వికసితమవగా
సదమల బుద్ధియు కలుగును సాక్షాత్కృతిగన్.

కం.

సుకవియె లోకపు చక్షువు
సుకవియె చైతన్య మూర్తి సుజన నుతుడగున్
సుకవియె లోకముమెచ్చగ
సుకవియె ధర నుతిని గాంచు సురుచిర వాణిన్

తే.గీ.

అక్షరములతో అద్భుత అర్థ మిచ్చి
జనని కీర్తిని పెంచును జగతి లోన
ధన్యమగు తల్లి గర్భము ధరణి యందు
వాసి గన్నట్టి వాగ్దేవి వాక్కు లనగ.

తే.గీ.

కమ్మనైనట్టి కవితల కలుగు మేలు
తావి వెదజల్లు తరగని తరుణ మలరి
మమత తోడను మనుజుల మనసు గెలిచి
సత్కవీశ్వరు డెప్పుడు సరిని నిలుచు.

తే.గీ.

అవని లోపల అవమాన మగ్ని జ్వాల
మానిసిని జేసె మహనీయ మనసు
తోడ పంక మందున పద్మంబు భవ్య రీతి
దళితు డైనను ధరణిని ధన్య మూర్తి!

తే.గీ.

దైవ చింతన దరిజేరు ధన్య జీవి
గుడిని జేరగా గుండెలు గుభులు మనెను
రాతి విగ్రహ రక్తిని రక్తి జూడ
మనుజు డుండడు మమతను మరిచి నపుడు!

తే.గీ.

జాతి హీనత జంకక జాటి చెప్పి
సీమ లోపల సింహంబు శీర్ష మెత్తు
నిదుర పోయెడి నిర్జిత నిశ్చ యంబు
మేలు కొల్పుము మేదినీ మేటి వగుచు!

తే.గీ.

చదువు నేర్పిన చీకటి చావు నొందు
మేధ వెలిగిన మేటిగ మెరయు నీవు
దీప మున్నను దీప్తిని దివ్వె జూడ
తొలగు చీకటి తొందర తొలగి నట్లు!

సమకాలీన అంశాలపై కొన్ని పద్యాలు రాయడమనేది నేటికీ జరుగుతునే ఉంది. కానీ, వాటిని బయటపెట్టడం లేదు. వచనకవిత్వాన్ని చదివేవారికి పద్య కవిత్వం పట్ల చిన్నచూపు ఉంటుంది. అది సరైందికాదు. పద్యంలో సంస్కృతపదభూయిష్టమైనశైలి పద్యాలకు బాగా అనుకూలం. కాబట్టి పద్యాలలో పదాలు చాలామందికి వెంటనే అర్థం కావు. ఈ విషయంలో కొంచెం నిష్పాక్షికంగా మాట్లాడుకుంటే చాలామంది వచనకవిత్వంలో కూడా అలాంటి శైలివాడుతున్నారు.

కం.

తాళిని కట్టిన విభునిని
కాల యముని జూచినట్లు కసితో చంపెన్
ఓలిని మమతలు వీడెను
జాలిని వదిలెను గదమ్మ జగతిని నేడున్.

కం.

ధనమున కాశను పెంచుచు
గనిన పితను జంపె సుతుడు కనికట ముడిగెన్
వినయము మాలిరి మనుజులు
దినదిన మును నీతి దప్పె దీనత తోడన్.

ఇలా పద్యాలు రాసే క్రమంలో ఉన్న కొన్ని విషయాలు తెలిసాయి. మన తెలుగు సాహిత్యంలో మధ్య కవులు ఎంత సాధన చేసేవారో అనిపిస్తుంది. కనిపించే ప్రతి పదం ఒక సూర్యగణమో, ఇంద్రగణమో అన్నట్లు అనిపించేది. పద్యం రాసే క్రమంలో భావుకతను కూడా మేళవించాలంటే శబ్దార్థాలపైన, వ్యాకరణం, అలంకారాలు వంటి వాటిపై గాఢమైన అభినివేశం ఉండాలని తెలిసింది. మరో వైపు అందరిలో ఉన్నా ఒంటరిగా ఏ ఛందస్సులలో పద్యం వర్ణించాలనీ, గణాలకు సరిపడే పదాల ఎంపిక, యతులు, ప్రాసలు వంటి వాటి గురించి ఆలోచించే ఒక సమాధ్యవస్థలో గడుపుతారని కూడా స్వీయానుభవం ద్వారా తెలిసింది.

అంకురార్పణ – ఆటవెలది శతకం

పద్యమిలాంటి లక్షణాలతో ఉండాలని చెప్పినంత సులువు కాదు పద్యం రాయడం. అలాగే పద్యం రాసినంత సులువు కాదు లక్షణ సమన్వయం చేయడం. ఈ రెండింటినీ మించి కవిత్వం కూడిన పద్యం రాయడం, పద్యంలోని కవిత్వాన్ని

గురువు లఘువుఁజేసి కుంచించి కుంచించి
లఘువు గురువుఁ జేసి లాఁగిలాఁగి
కవితఁ జెప్పునట్టి కవిగులామునుబట్టి,
ముక్కుఁగోయ వలయుఁ ద్రొక్కిపట్టి...

అని 'కావ్యాలంకార సంగ్రహం' పాఠంగా చెప్పేటప్పుడు కేవలం ఛందస్సు సరిపోతే అది పద్యం కాదని మా విద్యార్థులకు చెప్పడం నాకు తెలుసు. ఆ పద్యాన్ని ఇలా రాశాను కూడా!

కం.
ప్రాసల కోసము పదముల
కోసియు నతికించు కవిని కొట్టగ వలయున్
భాసించు భావమున్నను
దోషములే లేని కవిత దొరకుట మేలే!

దీన్నే ఆటవెలది, తేటగీతులలో చెప్తే ఎలా ఉంటుందని ప్రయత్నించానిలా.

ఆ.వె.
అర్థముట్టిపడగ నమరిన కవితయే
సార్థకముగ నిలుచు జగతి యందు
గణము కోసమచట గాడిద యరుపులు
కూయనేల నోరు నొప్పి పుట్ట!

తే.గీ.
గణము లఘువని లాగియు కంఠమెత్తి
గురువు కావని నొక్కియు గోల చేయు
కవిని గన్నను జాలము కలుగు నెపుడు
ముక్కు కోయుటె మేలౌను ముదము తోడ!

ఆ.వె.
యతిని గూర్చు కొరకు యాతన పడనేల?
ప్రాస కొరకు పదము జేసితెగడ?
నడక లేని కవిత నవ్వుల పాలౌను
కవిని ద్రొక్కి పట్ట గడగ వలయు!

చిన్నప్పుడు నాలు పాదాల్లా శబ్దాలను పేర్చి పద్యం అనుకునేవాడిని. తర్వాత పాఠశాల నుండి కళాశాలకు వచ్చే సరికి పద్యానికి సంబంధించిన అనేక అంశాలు నేర్చుకున్నాను. తగినంత శబ్దజ్ఞానం, దాన్ని వాడుకనే నిత్యం మనం చూసే, ఆలోచించే భావాలకు, సామాజిక స్పృహకు అక్షర రూపం ఇవ్వాలనే తపనతో మొదలైన ప్రయాణమే ఈ 'దార్ల మాట' శతకం. ఈ ప్రయాణం 'దార్ల మాట' అనే మకుటంతో రాసిన ఆటవెలది శతకంతో ఆరంభమైంది. ఆటవెలదిలోని తేటదనం, క్లుప్తత నాకు ఎంతో ఇష్టం. సమాజంలోని పోకడలను, మానవ సంబంధాలలోని సున్నితత్వాన్ని వంద పద్యాలలో బంధించి పాఠకుల ముందుంచాను. ఆ శతకానికి అందిన స్పందన నన్ను మరిన్ని అడుగులు ముందుకు వేయించింది.

ఆ పద్యాలలో ఛందోపరమైన కొన్ని దోషాలు ఉండొచ్చు. సాధ్యమైనంత వరకు నేను అనుకున్న భావాన్ని అర్థవంతంగా చెప్పడానికి ప్రయత్నం చేశాను. అయినా కొన్ని పద్యాలు శక్తివంతంగా చెప్పలేకపోవచ్చు కూడా. సాహిత్యాన్ని ఏ రూపంలో అందించాలన్నా, చదివే పాఠకులు తగ్గిపోతున్నారు. అందువల్ల క్లిష్టమైన భాష కంటే స్పష్టమైన భావాన్ని ఒక చిన్న పద్యంలో చెప్తే బాగుంటుందేమో అనిపించింది. శతకంలో పద్యం అనేది ముక్తకంగా ఉంటుంది. కనుక ఏదైనా ఒక భావాన్ని ఒక పద్యంలోనే చెప్పి ముగించేయవచ్చు. లేదనుకుంటే మరి కొన్ని పద్యాలలో కొనసాగించవచ్చు. కానీ, విడివిడిగా చూసినప్పుడు ఏ పద్యానికి ఆ పద్యం ఒక భావాన్నే వివరించే ప్రయత్నం చేస్తుంది. అందువల్ల కావ్యాన్ని అంతా చదివితే తప్ప రసస్ఫూర్తి పొందలేరేమోననే భావన ఉండాల్సిన పని లేదు. అందువల్ల పద్యం చదివేపాఠకులు అధికంగా ఉంటారు.

తెలుగులో పద్యాన్ని రాసేటప్పుడు, అది కూడా సరళమైన భాషలో రాయాలనుకున్నప్పుడు సంస్కృత పదభూయిష్టమైన శైలి లేకుండా రాయడం కష్టమని కూడా అనిపిస్తుంది. నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథుడు, అల్లసాని పెద్దన, పోతన వంటి కవులు తత్సమ తద్భవాలే అధికంగా తెలుగు భాష ద్వారా తమ పద్య మాధుర్యాన్ని వీనుల విందు చేశారు. పద్య రచనవల్ల మరొక అనుభవం కూడా కలిగింది. భావుకత ఎంత ఉన్నా సంస్కృత భాష, వ్యాకరణం,ఛందస్సు బాగా పట్టు పడితే తప్ప మధురమైన పద్యాన్ని రాయలేమని అనిపించింది. కేవల తెలుగు పదాలతో సమాసాలను చేయడం చాలా కష్టం. కొంతమంది తెలుగు వచన కవిత్వం పేరుతో రాస్తున్న కవిత్వాన్ని చూస్తే సంస్కృత భాష తెలుగులో ఎంత బాగా కలిసిపోయిందో అర్థం అవుతుంది. ఆ భాష అర్థం కాక, ఆ వచన కవితను కూడా వదిలేసే పరిస్థితి కనిపిస్తోంది. ఆధునిక జీవన విధానం ఫలితంగా అన్య భాషా పదజాలం, ముఖ్యంగా ఆంగ్ల భాష పదజాలం లేకుండా తెలుగు భాష మనజాలని పరిస్థితి ఏర్పడింది అనిపిస్తుంది.తెలుగు ఛందస్సులో 'తేటగీతి' పేరులోనే తేటదనం ఉంది. సరళమైన పదాలతో గంభీరమైన అర్థాన్ని స్ఫురింపజేయడం దీని ప్రత్యేకత. అందుకే, క్లిష్టమైన పదజాలం కంటే, సామాన్యుడికి అర్థమయ్యే శైలిలో, లోకరీతిని ప్రతిబింబించేలా ఈ పద్యాలను మలిచాలనే ప్రయత్నం చేశాను.ఈసారి తేటగీతి లో రాస్తే బాగుంటుందేమో అనిపించింది. "దార్ఢ్య నికునిప లుకువోలె దార్ల

మాట" అనే మకుటాన్ని రాసి, మా మిత్రుడు గోవిందు గోవర్ధన్ గారికి పంపించాను.ఆ మకుటంతో అమెరికా ఆధిపత్యాన్ని నిరసిస్తూ కొన్ని పద్యాలు రాసి పంపించాను.

తే.గీ.

అగ్ర రాజ్యపు గర్వమ్ము నణచ దలచి
రష్య నిలిచెను రణమున ధైర్య మొప్ప
ఎప్పుడైనను ధర్మమే గెలుపు నొందు
దార్ఢ్యనికుని పలుకువోలె దార్ల మాట.

తే.గీ.

శక్తి యున్నది యనుచును గర్వ పడెడి
మనుజు నైజము తోడనే రాజ్య మేలె
అంత మొందును నహంకార మవని యందు
దార్ఢ్యనికుని పలుకువోలె దార్ల మాట.

తే.గీ.

ఒక్కడే సర్వ లోకాన నొప్పు ననుచు
రెచ్చి పోయెడి దర్పము రాలి పోవు
సత్య ధర్మము నిలుచును జగతి యందు
దార్ఢ్యనికుని పలుకువోలె దార్ల మాట.

తే.గీ.

తానె బలిష్ఠుడనంచును తలచు చుండి
పరుల నణచెడి గర్వమ్ము నిలువ బోదు
కాల చక్రము తిరుగును ఖాయ మెపుడు
దార్ఢ్యనికుని పలుకువోలె దార్ల మాట.

తే.గీ.

ధర్మ పక్షాన నిలిచెడి రష్యాయె నని
జగము మద్దతు నిచ్చెను సంతసమున
సత్య మెప్పుడు జయమొందు సర్వ దిశల
దార్శనికుని పలుకువోలె దార్ల మాట.

తే.గీ.

పరుల శాసించు స్వార్థము పాప మగును
సకల లోకము శాంతితో సాగ వలయు
గర్వ మణిగిన జగమంత గౌరవించు
దార్శనికుని పలుకువోలె దార్ల మాట.

వీటిని ఒకసారి చూడండి మిత్రమా, ఆ మకుటంతోనే ఒక శతకం రాయాలనుకుంటున్నానని చెప్పాను. ఆ పద్యాల్లో ఒక పద్యాన్ని సరిచేసి, ఒక మకుటం కూడా ఆయన సృష్టించారు.

తే.గీ.

'అగ్ర రాజ్యపు గర్వమ్మునణచ దలచి
కంకణముదాల్చిరష్యాయె కదలెనిపుడు
ధర్మమేగెల్చునెటనైనధరణియందు
దార్శనికమైనదాచార్యదార్లమాట'

అయినా, ఆ మకుటాన్ని శ్రీ కంది శంకరయ్య గారికి పంపిస్తానని చెప్పారు. ఆయన "దారి చూపించు నట్టిది దార్ల మాట" అని సూచించారు. అంతే కాకుండా నా పద్యాలను సరిచూసి ఆ మకుటంతో పద్యాలు పంపారు.

తే.గీ.

అగ్ర రాజ్యపు గర్వము నణచ దలచి
కదనరంగానికైరష్యకాలుదువ్వె
ధర్మమే గెల్చునెపుడైన ధరణి యందు
దారి చూపించు నట్టిది దార్ల మాట

తే.గీ.

శక్తి యున్నది యనుచును సకలముతన
గుప్పిటనునిల్పనెంచును కోర్కె మీర
నంత మొందు నహంకార మవనియందు
దారి చూపించు నట్టిది దార్ల మాట

తే.గీ.

ఏకఛత్రాధిపత్యమ్మునేలనెంచి
రెచ్చిపోయెడిదర్పముఖచ్చితముగ
నిలువజాలకుండేనాడు నిక్కమిదియే
దారి చూపించు నట్టిది దార్లమాట

తే.గీ.

బలము కలదని పొగరుతో మెలగుతున్న
కాలచక్రముతిరుగును ఖచ్చితముగ
బండ్లుయోడలునవుచుండు ప్రాకటముగ
దారి చూపించు నట్టిది దార్ల మాట!

తే.గీ.

ధర్మ పక్షాన నిలిచి యధర్మ మణచ
పోరు సల్పును రష్యాయె ధైర్యముగను
సత్య మెప్పుడు జయమొందు శాంతి కోరు
దారి చూపించు నట్టిది దార్ల మాట

తే.గీ.

పరుల శాసించ నెంచిన పాపమగును
సకల లోకముల్ శాంతితో సాగవలయు
గర్వ మణగిన జగమంత గౌరవించు
దారి చూపించు నట్టిది దార్ల మాట

ఈ మకుటం కేవలం నా ఇంటిపేరును సూచించేది మాత్రమే కాదు; ఎవరి అక్షరమైని ఎప్పుడూ ఒక దారిని చూపాలి, చీకటిలో వెలుగు కిరణంలా మార్గదర్శనం చేయాలనే నా తపనకు ఇది సంకేతంగా అనిపించింది. రోజూ కొన్ని పద్యాలు రాయడం మొదలుపెట్టి, వాటిని మిత్రుడు గోవిందు గోవర్ధన్ గారికి పంపిస్తుండేవాడిని.

తే.గీ.

నీరు పల్లము జేరును నిశ్చయముగ
విద్య గర్వము వీడును వినయమున్న
విజ్ఞు డెప్పుడు నొందును విజయములను
దారి చూపించు నట్టిది దార్లమాట!

తే.గీ.

వాక్కు వాడిగ నుండును వరుస తప్పి
(వాక్కు వాడిగ నున్నను వైరమె యగు)
తీపి మాటలు నిచ్చును తెలివి నెపుడు
నోటి మంచియె చూపును నోము ఫలము
దారి చూపించు నట్టిది దార్లమాట!

తే.గీ.

మేఘ మడిగిన నిచ్చును మిన్న నీరు
(మేఘ మందించు నీటిని మిన్నగాను)
పుడమి సస్యము నిచ్చును పొలుపు మీర
త్యాగ గుణమున్న ధన్యుడు ధరణి లోన
దారి చూపించు నట్టిది దార్లమాట!

తే.గీ.

అనల మడవిని గాల్చును నంతముగను
కోప మగ్నిగ మార్చును కులము నంత
శాంతి సౌఖ్యము నిచ్చును సకల జనుల
దారి చూపించు నట్టిది దార్లమాట!

తే.గీ.

పాలు నీరును గలియును పరిమళమున
నేస్త మెప్పుడు నిలుచును నిలకడగను
నమ్మి యుండును నీడగ నాప్తు డెపుడు
(నీడ గానుండు నేస్తము నిర్మలముగ)
దారి చూపించు నట్టిది దార్లమాట!

బ్రాకెట్‌లో పెట్టినవి మిత్రుడు సరిచేసిన పాదాలు. నా శతకంలోని పద్యాలన్నీ పంపించాను. వాటిని ఆయన ప్రింట్ తీసుకొని సరిచేసి, ఒక్కొక్క పద్యం చొప్పున అన్ని పద్యాలను మరలా వాట్సాప్ లో టైప్ చేసి పంపించారు. ఆయనకు ఎన్ని విధాలుగా కృతజ్ఞతలు చెప్పుకున్నా తక్కువే!

దారి పూలతోట దార్ల మాట శతకం:

గతంలో నేను రచించిన'దారి పూల తోట దార్ల మాట' పేరుతో ఆట వెలదిలో రాసిన శతకానికి మంచి ప్రాచుర్యం వచ్చింది. కంది శంకరయ్య గారు, ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి గారు, ఆచార్య పిల్లలమర్రి రాములుగారు, ఆచార్య విస్తాలి శంకర్ రావు గారు ఆ పుస్తకానికి ముందుమాటలు రాశారు. మిత్రుడు గోవిందు గోవర్ధన్ కంద పద్యాల్లో నవరత్నాల్లో మిత్ర వాత్సల్యాన్ని చూపించారు.

కవికోకిల డా. జె. వి. యస్. చలపతిరావుగారు కొన్ని ప్రశంస పద్యాలు రచించి పంపారు. ఈ పుస్తకం ఉభయ రాష్ట్రాల్లోనూ అనేక చోట్ల ఆవిష్కరణలు చేశారు. అప్పటికి ఇంకా లాక్ డౌన్ ప్రభావం కొనసాగుతోంది. అందువల్ల ప్రత్యక్షంగా కొంతమంది పరోక్షంగా మరి కొంత మంది పాల్గొన్నారు.

నేను తెలుగు శాఖాధ్యక్షులుగా ఉన్నప్పుడు 'కొత్త పుస్తకంతో కాసేపు' అనే సంచికా కార్యక్రమాన్ని తెలుగు శాఖ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ప్రారంభించాను. కొత్త పుస్తకాలను పరిచయం చేయడం ద్వారా పిల్లల్లో పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంచాలనేది ఆ కార్యక్రమం లక్ష్యం. తొలిపుస్తకంగా నేను (ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు) రచించిన దార్ల మాట శతకాన్ని ఆవిష్కరించాం. ఆ కార్యక్రమాన్ని ఆచార్య వి. కృష్ణ, డీన్, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాదు ప్రారంభించారు. ఆ

సభలో ప్రత్యక్షంగా ఆచార్య జి.అరుణ కుమారి, ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆచార్య వి.కృష్ణ, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య పమ్మి పవన్ కుమార్, ఆచార్య డి.విజయలక్ష్మి, ఆచార్య ఎం. గోనానాయక్, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆన్లైన్‌లో ఆచార్య ఎండ్లూరి సుధాకర్, ఆచార్య విస్తాలి శంకరరావు గార్లు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం 9.8.2021వ తేదీన జరిగింది.

కర్నూలు లో 26.6.2021 వతేదీన ఈ శతకం ఆవిష్కరణ జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ రామస్వామి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకాన్ని గణేష్ దినపత్రిక సంపాదకుడు శ్రీ కొత్తూరు సత్యనారాయణ గుప్త గారికి అంకితం చేశారు. 26/07/2021 నాడు ప్రాచీన విశిష్ట అధ్యయనం కేంద్రం నెల్లూరులో 'దార్లమాట' శతకం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సదస్సు ప్రాజెక్టు డైరెక్టర్ ఆచార్య మునిరత్నం నాయుడుగారు, ప్రాజెక్ట్ రీసెర్చ్ ఫెలోస్ ఆధ్వర్యంలో జరిగింది. దీనికి సమన్వయ కర్తగా సీనియర్ ప్రాజెక్టు ఫెలో డా॥ ఎన్. రాంబాబు వ్యవహరించారు.

దార్లమాట శతకాన్ని ఆంధ్రప్రదేశ్ హోం శాఖామంత్రి గారైన శ్రీమతి మేకతోటి సుచరిత గారు, తెలంగాణ రాష్ట్ర ఐ. ఆర్.యస్. శ్రీ మేకతోటి దయాసాగర్ గారి చేతుల మీదగా ఈ రోజు అనగా 11-07-2021 న, హోంమంత్రి క్యాంపు కార్యాలయం, గుంటూరులో ఆవిష్కరించారు. డా.జరుపుల రమేష్ ఆధ్వర్యంలో ఖమ్మంలో దార్ల మాట శతకం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.

శతకంపై వ్యాసాలు: దారి పూల తోట దార్ల మాట శతకంపై విశేషమైన స్పందన వచ్చింది. ఎంతోమంది ఈ పుస్తకంపై సమీక్షలు రాశారు. జాతీయ సదస్సులో పాత్ర సమర్పణలు చేశారు. దార్ల మాట శతకాన్ని అన్నామలై విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా కొనసాగుతోంది. డా.జరుపుల రమేష్ దార్ల మాట శతకం పై ఒక పుస్తకం రచించారు. డా.మంగళగిరి శ్రీనివాస్, మమత వేపాడ, డా.జి.శ్రీనివాస రావు, డా. పి విజయకుమార్ (పద్యపారిజాతాలు పరిమళింప చేసిన పూలతోట 'దార్లమాట', భావవీణ మాసపత్రిక, ఏప్రిల్-2022, పుటః 68-70), దారివేముల అనిల్ (మానవత్వ విలువల మూట దార్ల మాట శతకం, 9.2.2025 సృజనక్రాంతి దినపత్రిక), సమకాలీన సమాజ దర్పణం 'దార్ల మాట శతకం' పేరుతో

ప్రముఖ కవి, కథకుడు, పరిశోధకుడు డాక్టర్ జడా సుబ్బారావు గారు, సాహిత్య ప్రస్థానం, సెప్టెంబరు, 2021 పుటః 29-32, సంచికలో ఒక విశ్లేషణాత్మకమైన వ్యాసాన్ని రాశారు.

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురము వారు నిర్వహించిన 'తెలుగు శతక సాహిత్యం - సామాజిక దృక్పథం' అనే జాతీయ సదస్సులో 'దార్ల మాట శతకం - సామాజిక దృక్కోణం' పేరుతో పరిశోధకురాలు బొమ్ము మహాలక్ష్మి, పత్రాన్ని సమర్పించారు. ఈ పత్రం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అనంతపురం వారి ఆధ్వర్యంలో మూసీమాసపత్రిక ప్రత్యేక సంచిక జూన్,2025, పుట: 118-212 లో ప్రచురించారు.

ఈ శతకంలో ప్రధానంగా...

మాతృ-పితృ వందనం: కన్నవారి ఔన్నత్యాన్ని చాటే పద్యాలు.

కవితా వైభవం: అక్షరానికి ఉన్న శక్తిని, కవి బాధ్యతను తెలిపే భావాలు.

సామాజిక నీతి: లోకంలోని విలువలు, మానవ సంబంధాల విశ్లేషణ.

గురు-మిత్ర ప్రశంస: నా ఎదుగుదలకు తోడ్పడిన మహనీయుల స్మరణ.

"కలము పట్టిన యోధుడు" తన అక్షరాలతో కాలాన్ని ఎలా జయించగలడో, ఆ అక్షరాలు సమాజానికి ఎలా తోడ్పడతాయో ఈ శతకం ద్వారా విన్నవించుకుంటున్నాను. ఈ 'దార్ల మాట' పాఠకుల హృదయాలను తాకి, అంతో ఇంతో ఆలోచింపజేస్తే నా శ్రమ సార్థకమైనట్లే.

దార్లమాట తేటతెలుగు శతకానికి చక్కని ముందుమాట రాసిన ప్రముఖకవి, విమర్శకుడు ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డిగార్కి నా ప్రత్యేక కృతజ్ఞతలు. నేను పద్యం రాయడానికి, మరలా పుస్తకం వేయడానికి ప్రేరణమైన కవి గోవిందుని గోవర్ధన్ గార్కి నా నా ప్రత్యేక కృతజ్ఞతలు.యువ విమర్శకులుగా, పరిశోధకులుగా పేరు ప్రఖ్యాతులు పొందుతున్న డా.బండారు విజయ్ కుమార్, డి.సాయినాథ్ రెడ్డిలకు ఈ శతకానిపై చక్కని వ్యాసాన్ని రాసినందుకు వారికి నా కృతజ్ఞతలు. దార్లమాట శతకం మళ్ళీ ప్రచురించుకున్న మా పుత్రరత్నం దార్ల శ్రీనివాసరావుకీ, నా ఆలనాపాలనా చూసుకొనే నా జీవిత భాగస్వామి డా.ఎం.మంజుశ్రీకి శుభాశీస్సులు.

- దార్ల వెంకటేశ్వరరావు

సందేశాత్మక ఆధునిక శతకం దార్ల మాట

-ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి
అధ్యక్షులు, పాఠ్య ప్రణాళికా సంఘం
తెలుగు శాఖ, యోగి వేమనవిశ్వ విద్యాలయం
కడప.

కష్టే ఫలి అని నమ్మినవాడు, అడ్డొచ్చిన అవమానాలను తొక్కుకుంటూ ముందుకు నడిచిన వాడు, విజయ పతాకం చేతబట్టి మార్గదర్శనం చేస్తున్న వాడు, ఆచార్యుడిగా, విమర్శకుడిగా, కవిగా, స్వీయ చరిత్రకారుడిగా తనకంటూ ఒక ప్రత్యేకతను సాధించుకున్న మనిషి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పనిచేస్తూ ఎంతో మంది విద్యార్థులకు దారి దీపంలో నిలుస్తున్నవాడు, మరెంతో మందికి నీడనిచ్చే ఒక విద్యా వృక్షమై ఆప్యాయతను పంచుతున్నవాడు. మంచి చెడుల వివేచనను నేర్పుతున్న వాడు, కష్టసుఖాల స్వభావాలను అక్షరాలుగా మారుస్తున్న వాడు దార్ల వెంకటేశ్వరరావు. నిరంతర పోరాటంలో అంది వచ్చిన అనేక అనుభవాలను అస్త్రాలుగా చేసుకున్న వాడు, ఎదురొచ్చే ఆటంకాల చీకట్లను చీల్చి చెండాడే వాడు దార్ల. కలిమిలేముల కాలాలపై కవాతు చేసినవాడు, సామాజిక ఎత్తు పల్లాలపై నడిచొచ్చినవాడు దార్ల. కామందుల దురహంకారాన్ని నిలువునా విరిచిన వాడు, ఆత్మవిశ్వాసాన్ని విల్లుగా చేసి యుద్ధం చేసినవాడు దార్ల.

అక్షరాలను రెక్కలుగా చేసుకుని విజ్ఞాన విహాయస యాత్ర చేస్తున్న దార్ల తనకు అందిన జ్ఞానాన్ని అనుభవ పాఠాన్ని తిరిగి అక్షరాలుగా మార్చి అందిస్తున్నాడు. తన అక్షరానికి దార్ల మాటగా నామకరణం చేసుకున్నాడు. తను పొందిన జ్ఞానానుభవాన్ని శతాధిక పద్యమాలగా మార్చి భావితరాలకు అందివ్వాలని నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయానికి ప్రతిఫలంగా వచ్చిందే మీ చేతిలో ఉన్న ఈ "దార్ల మాట" శతకం.

తెలుగు సాహిత్య ప్రక్రియల్లో శతక సాహిత్యం ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకుంది. జీవన విలువలను, నైతిక సందేశాలను, సామాజిక బాధ్యతలను సరళమైన పద్యరూపంలో ప్రజల హృదయాల్లో నాటే శక్తి శతకాలకు ఉంది. ఈ సాహిత్య

పరంపరలో ఆవిష్కృతమైన "దార్ల మాట" తేటగీతి ఛందస్సులో ఆధునిక భావజాలాన్ని సమన్వయ పరుచుకున్న సార్థక కృతి.

సహజంగా శతకాలు ముక్తకాలుగా ఉంటాయి. ఏ పద్యానికి ఆపద్యమే అర్థవంతంగా ముగిసిపోతుంది. ఒక పద్యానికి పైనున్న పద్యం లేదా కిందనున్న పద్యానికి అనుసంధానం ఉండదు. ఏ పద్యానికి ఆ పద్యమే స్వతంత్రంగా ఒక భావాన్ని అందిస్తుంది. దార్ల మాట శతకంలో కూడా అలాంటి లక్షణాలు ఉన్నప్పటికీ, ఆ పద్య క్రమాన్ని చూస్తే ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటుంది. తల్లి తండ్రి గురువు దైవము అని మనం వరుసక్రమాన్ని చెప్తూ ఉంటాం. దార్ల మాట శతకంలో దైవం, తల్లి, తండ్రి, గురువు, స్నేహితులు ఇలా ఒక క్రమంలో కనిపిస్తారు.

తల్లిదండ్రులను గురువు దైవాలను గౌరవించే ఒక భారతీయ సంప్రదాయ ప్రేమికుడు దార్ల. ఒకవైపు అస్తిత్వ ఉద్యమానికి చేయూతనిస్తూ దళిత కవిత్వం రాస్తున్న ఈయన మరోవైపు సంప్రదాయ విలువలని కాపాడుకొంటూ రావడం అనేది ఈయనలో ఉన్న వైవిధ్యం. చాలామంది 'మేము ఆధునికులం' అని చెప్పుకుంటున్న వారు పునాదులను మరిచిపోయి, పైకప్పుల చర్చలు చేస్తుంటారు. నిలబడ్డ భూమిని వదిలి, గాలి దుమారంలో తేలిపోతూ ఎగసిపడుతుంటారు.

మార్పు కోసం మాట్లాడడం అటుంచి తీర్పులు చెప్పేస్తుంటారు. మాటలకు ఈటెలు తగిలించి అవతలి వారిని గాయపరుస్తుంటారు. వర్గాల పేరుతో, వర్ణాల పేరుతో పురాణ సంఘటనలకు ముడిపెట్టి తీవ్ర పదజాలంతో పేట్రేగిపోతుంటారు. బహుశా గుర్తింపు కోసం కొంతమంది కూడా అలా చేస్తూ ఉండొచ్చు. దార్ల దీనికి విభిన్నమైన వ్యక్తి. కుల మతాలకతీతంగా, వర్ణ వర్గాలకు దూరంగా తను చెప్పదలుచుకున్న నాలుగు మాటలను నిజాయితీగా చెప్పడానికి ప్రయత్నం చేస్తాడు.

గురువు నేర్పిన విద్యను మరువ కెపుడు
జ్ఞాన దీపము వెలిగించు నవని యందు
నిత్య విద్యార్థ నపరుడు నిశ్చ యముగ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (24)

"పాఠశాలలు చూపించు బ్రతుకు బాట
మస్తకమును పెంపొందించు పుస్తకములు

వినయ విధేయతలు నున్న విజ్ఞతడు
దారి చూపించునట్టిది దార్ల మాట" (25).

ఈ రెండు పద్యాలు ఒకే అంశానికి సంబంధించినవి. అయితే రెండవ పద్యంలో వినయ విధేయతలు ఉన్న విజ్ఞుడు ఎవరో తెలియాలంటే ఆ ముందు పద్యం చదివి రావాల్సిందే. అలా ఒక కొత్త ప్రయోగం కనిపిస్తుంది.

ఈ శతకంలో ప్రధానంగా కనిపించే అంశాలు...

• **నైతిక – మానవతా విలువలు:** 'కష్టపడుకున్న ఫలితము కలుగ దెపుడు తప్పకుండగ సోమరితనము వీడి, కంకణము దాల్చి ముందుకు కదల వలెను'. జీవులు అత్యాశపరులై అక్రమార్జన కొరకు అడుగులిడుట తప్పు అంటాడు. కష్టపడకుంటే ఫలితం ఉండదని,సోమరితనం వదిలి శ్రమించాలని పిలుపునిస్తాడు. మాట తప్పని వాడికి మన్నన దొరుకుతుందని చెప్తాడు.

• **తల్లిదండ్రుల పట్ల గౌరవం:** 'పెద్ద నాగమ్మ మాతృత్వ ప్రేమ పంచి ఆదరమ్మను దీవెన లందజేసి నమ్మకమ్మను నీడలో నడుపు చుండు దారి చూపించు నట్టిది దార్ల మాట'. 'నాదు జనకుడు లంకయ్యానామునెపుడు నాద రంబున నబ్బాయి యనుచు పిలిచి దీవెనలు పొందు చుందును దిగులుమాన్ప దారి చూపించు నట్టిది దార్ల మాట'.

• **గురుభక్తి :** గురువు నేర్పిన విద్య మరవకూడదని,జ్ఞాన దీపం వెలిగించే వ్యక్తిగురువు ఒక్కడేనని,వినయ విధేయతలతో మెలిగి విజ్ఞుడవ్వాలని సూచిస్తాడు'.

• సత్యనిష్ఠ: సత్య వాక్కును సజ్జనుడు మరువడని,ధర్మమే నిలిచి గెలుస్తుందని 'ఆశ పెరిగిన ధర్మమ్మునడుగు నంటూ సత్యమార్గమ్మువీడక సాగవలయు','వంశ గౌరవ మన్నది వాక్కు తోడ సత్యమెప్పుడు వీడక సాగవలెను మాట తప్పని వానికి మన్ననబ్బు' నంటాడు. నీతి నియమాలను పాటిస్తూ, నమ్మకము అనే కొమ్మను నరక కుండా చూడమంటాడు.

• **స్నేహబంధం:** 'ఆప్త మిత్రులైనిలిచిరి యనుదినమ్ము వారు చలపతి రావును పార్వతీశ శర్మ గారలన్ నిరతముసంస్తుతింతు', 'సూర్యుడుదయించుకమునుపు నార్యయనుచు పలుక రించు మిత్రుండు గోవర్ధనుండు మిత్ర భావము తోడను మేలుగూర్చు'నని గుర్తు పెట్టుకుంటాడు. ఇవి వ్యక్తిగత జీవిత నిర్మాణానికి అవసరమైన మూలాధారాలుగా కవి ప్రతిపాదించారు. ఆపదలు ఎదురైనప్పుడు ఆదుకునే మిత్రులను ఎప్పటికీ మనసులో దాచుకోవాలని చెప్తాడు.

• **సమాజిక బాధ్యత:** వ్యర్థాలను సృష్టించే ప్లాస్టిక్ వాడకూడదని, ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ఎంతో ముప్పు కలుగుతుందని బోధిస్తాడు, దాన్ని నిర్మూలించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలంటాడు. దాన గుణం కలిగిన వారు దాచుకోకుండా నిరుపేదలకు పంచిపెడతారని, విత్తమార్జన కోసం సత్య న్యాయ ధర్మాలను బుద్ధివంతులు వీడరని పేర్కొంటాడు. 'కులము మతబేధములపేరా కుటిల మెపుడు నెంచ వలదయ్య ప్రజలలో నెవ్వరైన, లోక హితము కోరాలి ప్రాకటముగ' అంటాడు. అంతేగాక, నీతి, న్యాయం పట్ల కట్టుబాటు, మితవ్యయం, ఆత్మనిగ్రహం వంటి అంశాలను పద్య రత్నాలుగా మార్చారు.

• **బాలల వ్యక్తిత్వ వికాసం:** పిల్లలు అక్షరాభ్యాసం నుండి విద్య నేర్పిన గురువులను గౌరవంగా చూడమనడం, మాతృభాష పట్ల అభిమానం లిగి ఉండడం, చెప్పిన మాట తప్పక వినాలని చెప్పడం, సోమరిగా ఉండకూడదని చెప్పడం, దేశ భక్తిని కలిగి ఉండడం, సహజ గుణ శీలాలతో గౌరవం పొందమని చెప్పడం, మేలు చేసిన వారికి మేలే చేయమని చెప్పడం, మిత్ర భావాన్ని కాపాడుకోమని చెప్పడం, దీనుల పట్ల దయ జాలి కలిగి ఉండమని చెప్పడం వంటి బుద్ధులను సూక్తులుగా చెప్తాడు. ఇవి పిల్లలకే కాదు పెద్దలకు కూడా చెప్పవలసిన మాటలు.

• **బౌద్ధ తత్వం:** అంతం లేని కోరికలే దుఃఖానికి మూలమని, తృప్తే సంతోషానికి ద్వారమని, వ్యాధులకు, వృద్ధాప్య వలయానికి చిక్కి ఆల్లాడి పోతారని బుద్ధుడి కోణం లోంచి హితవు పలుకుతాడు. కులమత బేధాలు వీడి, మూఢ నమ్మకాలను వదిలి, కారుణ్య భావంతో మెలిగితే లోక కల్యాణం జరుగుతుందని సూచిస్తాడు. మంచి నడవడిక, శాంతి సహనాలు, దాన ధర్మాలు మానవ సమాజాన్నిఉన్నతంగా నిలబెడతాయని బౌద్ధ సందేశాన్ని అందిస్తాడు.

పర్యావరణ చింతన (Eco-consciousness)

ఈ శతకంలో అత్యంత ప్రాధాన్యమైన అంశం ప్రకృతి సంరక్షణ. 'చలువ నిచ్చును గాదె వృక్షమ్ము లెపుడు, ప్రాణ వాయువు నందించి బ్రతుక జేయు,చెట్లు నరికిన ప్రాణికీ చేటు చేయు'.వృక్ష సంపద నెలకొన్న విరివిగాను,కురియుచుండును వర్షాలు విరివి గాను,నరులు నమ్మాలి ప్రకృతిని మరువకెపుడు' అనడంలోనే పర్యావరణంలో చెట్లు ఎంత ప్రాధాన్యం కలిగిం ఉన్నాయో అర్థం అవుతుంది.

♦ చెట్ల నరికివేతపై ఆందోళన

♦ నీటి విలువ

♦ కాలుష్య సమస్య

♦ భూమి, గాలి, నీటి పరిరక్షణ మొదలైన విషయాల పట్ల చైతన్యం కలిగిస్తుంది ఈ శతకం. సాంప్రదాయిక శతకాలలో అరుదుగా కనిపించే ఈ పర్యావరణ దృక్పథం, ఈ కృతికి ఆధునికతను తెచ్చింది. ప్రత్యేకంగా పర్యావరణ పరిరక్షణపై రచయిత వ్యక్తపరచిన ఆందోళన ఈ కృతికి సమకాలీన ప్రాముఖ్యతను తెచ్చింది. చెట్ల సంరక్షణ, నీటి విలువ, కాలుష్య నియంత్రణ వంటి అంశాలు కేవలం ఉపదేశాత్మకంగా కాక, హృదయాన్ని తాకే విధంగా పద్యరూపంలో ఆవిష్కరించబడ్డాయి. ఈ విధంగా శతకం ఒక నైతిక శాస్త్రగ్రంథంలా, జీవన సూత్రాల సంకలనంలా నిలుస్తుంది.

సరళమైన భాష. లయబద్ధత, వ్యవహార పదప్రయోగం, ఉపదేశ ధోరణి కలిగి, ప్రతి పద్యం ఒక సూక్తిలా ఉంటుంది. భావస్పష్టత, సమకాలీన సమస్యల ప్రతిఫలనాలు, శతక నిర్మాణ నిబద్ధత, మానవ విలువల ప్రచారం దార్ల మాట శతకానికి వన్నెతెచ్చాయి.

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు విద్యావేత్తగా, పరిశోధకునిగా, కవిగా సమాజం పట్ల తన బాధ్యతను పద్యరూపంలో వ్యక్తపరచడం ప్రశంసనీయం. "దార్ల మాట" అనే మకుటంతో ప్రతి పద్యం ఒక జీవన సందేశంగా, మార్గదర్శక వాక్యంగా రూపుదిద్దుకుంది. తల్లిదండ్రుల పట్ల గౌరవం, గురుభక్తి, సత్యనిష్ఠ, మానవతా విలువలు, స్నేహం, సామాజిక నైతికత వంటి అంశాలతో పాటు ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, సమాజ బాధ్యత వంటి ఆధునిక చైతన్య భావనలు కూడా ఈ శతకంలో సుస్పష్టంగా వ్యక్తమయ్యాయి. భాషా సరళత, భావాల స్పష్టత, తేటగీతికి అనుగుణమైన లయ, పద ప్రయోగంలో వైవిధ్యం ఇవి ఈ శతకానికి సాహిత్య విలువను పెంచిన అంశాలు. పాఠకుడు ప్రతి పద్యాన్ని చదువుతూనే ఆత్మపరిశీలన చేసుకునేలా చేయడం ఈ కృతికి ఉన్న ప్రధాన లక్షణం. ఈ శతకం సాహిత్యాభిమానులకు మాత్రమే కాక, విద్యార్థులకు, యువతకు, సమాజంలో విలువల ఆధారిత జీవనాన్ని కోరుకునే ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తుందని నమ్ముతున్నాను. రచయితకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఈ కృతి విస్తృత ప్రచారం పొందాలని ఆకాంక్షిస్తున్నాను.

***

సమకాలీన సామాజిక దార్శనికతకు గీటురాయి: 'దార్ల మాట' తేటగీతి శతకం

– డా. బండారు విజయ్ కుమార్,
సామాజిక, సాహిత్య విశ్లేషకులు

"కులము మతభేద ములనెల్ల కూల్చివేసి
మనిషి మనిషిగా బ్రతికిన మనుగ డౌను
సమత మమతలు పంచెడి సత్యమిదియె
దారి చూపించు నట్టిది దార్ల మాట"

(దార్ల మాట తేటగీతి శతకం – పద్యం: 123)

"దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్" అని నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు గారు ఏనాడో చెప్పారు. మట్టిని ప్రేమించడం కంటే, మనిషిని మనిషిగా ప్రేమించడమే అత్యున్నతమైన ధర్మమని, కులమతాల అడ్డుగోడలు కూల్చివేసినప్పుడే నిజమైన 'వసుధైక కుటుంబం' సాధ్యమవుతుందని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు పై పద్యంలో అద్భుతంగా ఆవిష్కరించారు. మహాకవుల ఆలోచనలకు, వర్తమాన సామాజిక అవసరాలకు వారధి కడుతూ, మానవత్వ పరిమళాలను వెదజల్లుతున్న అక్షర కుసుమమే ఈ 'దార్ల మాట'.

సాహిత్యం సమాజానికి దర్పణం అంటారు. కానీ, ఆ దర్పణంలో కనిపించే రుగ్మతలకు సరైన చికిత్సను అందించేది 'శతక సాహిత్యం'. పామరుడికి సైతం అర్థమయ్యే రీతిలో పాలకుల మెప్పు కోసం కాకుండా, ప్రజాహితం కోసం ఉద్భవించిన ఈ ప్రక్రియలో నాటి వేమన, బద్దెనల సరసన నేటి డిజిటల్ యుగంలో సగర్వంగా నిలబడగలిగే అద్భుతమైన కృతి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి "దార్ల మాట తేటగీతి శతకం". కవిగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా తనదైన ముద్రవేసిన ఆచార్య దార్ల వారు, ఈ

పద్యాలకు వస్తువును ఆకాశం నుంచి దిగుమతి చేసుకోలేదు. గ్లోబలైజేషన్ మాయలో పడి కునారిల్లుతున్న పల్లెలు, స్వార్థంతో కలుషితమవుతున్న పర్యావరణం, కుప్పకూలుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, అడుగంటుతున్న నైతిక విలువలు -- ఇవే ఆయన పద్యాలకు ముడిసరుకులు. తాను సమాజంలో చూస్తున్న, అనుభవిస్తున్న, ఆవేదన చెందుతున్న సమకాలీన పరిస్థితులకు అక్షరరూపమే ఈ శతకం.

నేటి ఇంటర్నెట్ యుగంలో గూగుల్ (Google) లో తెలుగు సాహిత్యంలోని ఏ ప్రక్రియ గురించి వెతికినా, ముందుగా కనిపించే మొదటి ఐదు పేర్లలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి పేరు కచ్చితంగా ఉంటుంది. అంతర్జాలంలో తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ నలుమూలలా అందుబాటులో ఉంచడంలో ఆయన చేసిన సేవ మహోన్నతమైనది. సాహిత్యంలోని ఏ ప్రక్రియను తీసుకున్నా, ఆయన అందులో విశేషమైన కృషి చేసి, ఆయా ప్రక్రియలకు ఒక్కొక్క కోటను నిర్మించి, ఆ కోట పైన 'దార్ల' అనే జెండాను సగర్వంగా పాతారు. ఒక గొప్ప విమర్శకుడిగా, కథకుడిగా, నవలాకారుడిగా, వ్యాసకర్తగా, విశ్లేషకుడిగా, కవిగా ఇప్పటికే తనదైన ముద్ర వేసిన ఆయన... ఇప్పుడు ఒక 'శతక కర్త'గా కూడా మన ముందు ఉద్భవించడం తెలుగు సాహిత్యానికి గర్వకారణం. ఆయన అడుగుపెట్టని సాహిత్య రంగం లేదు, పండించని పంట లేదు.

శతకానికి ప్రాణం 'మకుటం'. పద్యం ఏ విషయాన్ని చెప్పినా, అంతిమంగా మకుటం ఆ పద్యం యొక్క తాత్త్వికతను నిర్దేశిస్తుంది. వేమన తన శతకంలో "విశ్వదాభిరామ వినుర వేమ" అంటూ ప్రపంచం మొత్తాన్ని సత్యాన్ని వినాల్సిందిగా మేల్కొల్పాడు. బద్దెన తన సుమతీ శతకంలో "సుమతీ!" అంటూ చదివేవాడికి సద్బుద్ధి (మంచి మనసు) కలగాలని ఆకాంక్షించాడు. ఈ రెండు శతకాల్లోని తాత్త్వికతను, మానవీయతను ఒంటబట్టించుకున్న ఆచార్య దార్ల గారు, తమ శతకానికి ఎంచుకున్న మకుటం- "దారి చూపించు నట్టిది దార్ల మాట". ఇది కేవలం ఒక సంబోధన కాదు, గందరగోళంలో ఉన్న నేటి సమాజానికి ఒక 'మార్గదర్శనం'. ఏది సత్యమో, ఏది అసత్యమో, ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలియక కొట్టుమిట్టాడుతున్న ఆధునిక మానవుడికి కారుచీకటిలో ఒక కాగడా లాగా దారి చూపే అక్షర సత్యం ఈ 'దార్ల మాట'.

సాధారణంగా శతక పద్యాలు ఏ ఛందస్సులో ఉన్నాయి అనేదాన్ని బట్టి ఆ కవి యొక్క ఉద్దేశం, ఆ పద్యం యొక్క నడక ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, ప్రజాకవి వేమన తన సామాజిక విమర్శనంతటినీ సరళమైన 'ఆటవెలది'లో అలవోకగా పలికారు. బద్దెన తన నీతి సూత్రాలను 'కంద పద్యం'లో కుదించి చెప్పారు. ధూర్జటి వంటి భక్త కవులు తమ శ్రీకాళహస్తీశ్వర శతకంలో 'శార్దూల, మత్తేభ' వృత్తాలలో తమ భక్తిని, పాండిత్యాన్ని చాటుకున్నారు.

అయితే, ఆచార్య దార్ల వారు ఈ శతకానికి 'తేటగీతి' ఛందస్సును ఎంచుకోవడం వెనుక ఒక బలమైన సామాజిక కారణం ఉంది. 'తేట' అంటే స్వచ్ఛమైనది, స్పష్టమైనది అని అర్థం. 'గీతి' అంటే గానం చేయదగినది. సంక్లిష్టమైన సమాసాలు లేకుండా, పండితులకే కాకుండా పామరులకు, విద్యార్థులకు కూడా సూటిగా అర్థమయ్యే రీతిలో, ఒక పారుతున్న ఏరులాగా భావం సాగిపోవడానికి తేటగీతి అత్యంత అనుకూలమైన ఛందస్సు. గురు లఘువుల గణన కంటే, భావ ప్రకటనకే కవి పెద్దపీట వేశారు. అందుకే ఆయన దీనికి 'దార్ల మాట తేటగీతి శతకం' అని సార్థక నామధేయం చేశారు. క్లిష్టమైన వృత్త పద్యాల జోలికి వెళ్లకుండా, సామాన్యుడి గుండెకు హత్తుకునేలా చెప్పడానికి ఈ తేటగీతిని ఎంచుకోవడం ఆయనలోని సామాజిక స్పృహకు నిదర్శనం.

దార్లన్నతో నా అనుబంధం -ఒక మధుర జ్ఞాపకం:

గురువు అంటే కేవలం తరగతి గదిలో పాఠం చెప్పేవాళ్లు మాత్రమే కాదు, జీవిత గమనాన్ని నిర్దేశించే మార్గదర్శకులు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (HCU)లో నేను, నా అన్నయ్యలు (శ్రీనివాస్ అన్న, రాజేంద్రం, జయరాజ్ అన్న) పీజీ (PG) చదువుతున్న రోజుల్లో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు మాకు 'దార్లన్న'గా సుపరిచితులు. ఆ రోజుల్లో ఆయన వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేస్తూనే, తన పరిశోధన (Ph.D) నిమిత్తం యూనివర్సిటీకి వచ్చినప్పుడు వారు మాతో అమూల్యమైన సమయం గడిపేవారు. విశ్వవిద్యాలయంలోని 'గోప్స్'లో మాతో కలిసి టీ తాగుతూ, జేఆర్ఎఫ్ (JRF) సాధించడానికి చదవాల్సిన పుస్తకాలను మాకు సూచిస్తూ ఎంతో స్ఫూర్తిని నింపేవారు. ఆనాడు ఒక అన్నగా భుజం తట్టిన 'దార్లన్న', నేడు ప్రొఫెసర్‌గా, శాఖాధిపతిగా

ఎదిగి, నాలాంటి ఎందరో పరిశోధక విద్యార్థులకు, సాహిత్యాభిమానులకు

మార్గదర్శకులయ్యారు.

ఆచార్య దార్ల గారి శతకంలోని పద్యాలను వివిధ కోణాల్లో పరిశీలిస్తే, ఆయన దార్శనికత, తాత్త్వికత ఎంత లోతైనదో, స్పష్టమైనదో అర్థమవుతుంది.

1. పర్యావరణ స్పృహ – రేపటి తరానికి ప్రాణవాయువు

ఆధునిక అభివృద్ధి ముసుగులో మనం చేసుకుంటున్న స్వయంకృతాపరాధాలను కవి ఈ పద్యంలో ఎత్తిచూపుతున్నారు. కాంక్రీట్ భవనాల కోసం పచ్చని చెట్లను నరికేస్తూ, ఆక్సిజన్ సిలిండర్ల కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్న నేటి మానవుడి దుస్థితిని చూసి కవి గుండె తరుక్కుపోతోంది. రేపటి తరానికి ఆస్తిపాస్తులు ఇవ్వకపోయినా పర్లేదు కానీ, కనీసం పీల్చే గాలిని కూడా మిగల్చకపోతే ఎలా అనే కవి ఆవేదన ఇందులో కనిపిస్తుంది.

చలువ నిచ్చును గాదెవృక్షమ్ములెపుడు
ప్రాణవాయువు నందించి బ్రతుక జేయు
చెట్లు నరికిన ప్రాణికీ చేటు కలుగు
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 29)

గ్లోబల్ వార్మింగ్ (Global Warming) అనేది కేవలం అంతర్జాతీయ సదస్సుల్లో చర్చించే అంశం కాదు, అది మన పెరటి మొక్కతో ముడిపడి ఉన్న జీవన సమస్య అని కవి హెచ్చరిస్తున్నారు. చెట్లను నరకడం అంటే మన గొంతును మనమే నులుముకోవడం అని, ప్రకృతి రక్షణే మానవ మనుగడకు రక్షణ కవచమని కవి స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యత వహించకపోతే మానవాళి అంతం తప్పదని ఈ పద్యం ఘోషిస్తోంది.

నీటి కోసం యుద్ధాలు జరుగుతాయేమోనన్న భయంకరమైన రోజుల్లో మనం ఉన్నాం. జల వనరులను కలుషితం చేస్తూ, భూగర్భ జలాలను తోడేస్తూ, వర్షం పడినప్పుడు ఆ నీటిని ఒడిసిపట్టకుండా సముద్రం పాలు చేస్తున్న మన అజ్ఞానాన్ని కవి నిలదీస్తున్నారు. ఆకాశం నుంచి రాలిన ప్రతి చినుకూ ఒక సంపద అని, దానిని దాచుకోకపోతే భవిష్యత్తు

ఎడారిగా మారుతుందని కవి ఆందోళన చెందుతున్నారు.

నీరు లేనిది నిఖిలము నిలువబోదు
వందనమ్ముగ మేఘమ్ము లందజేసె
చినుకు చినుకు ను దాచాలి చిత్తగించి
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 32)

నీరు లేనిదే సృష్టి లేదు, జీవం లేదు. మేఘాలు మనకు అందించే వర్షం ప్రకృతి ప్రసాదించిన వరం. వాన నీటిని భూమిలో ఇంకించుకోవడం (Rainwater Harvesting) ప్రతి పౌరుడి కనీస బాధ్యత అని కవి గుర్తుచేస్తున్నారు. చినుకును చిన్నచూపు చూస్తే, రేపు గుక్కెడు నీళ్ల కోసం తల్లడిల్లక తప్పదని, జల సంరక్షణే మన భవిష్యత్తుకు భరోసా అని దార్ల వారు ఎంతో ముందుచూపుతో హెచ్చరిస్తున్నారు.

వాడి పారేసే (Use and throw) సంస్కృతిలో భాగంగా ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగి పోయింది. ఈ ప్లాస్టిక్ భూతం భూమిని సారహీనం చేయడమే కాకుండా, పశు పక్ష్యాదుల ప్రాణాలను సైతం బలిగొంటోంది. తాత్కాలిక సౌకర్యం కోసం మనం వాడుతున్న ప్లాస్టిక్, భవిష్యత్ తరాలకు శాపంగా మారుతున్న వైనాన్ని, నాగరికత పేరుతో మనం చేస్తున్న అనాగరిక చర్యలను కవి ఈ పద్యంలో తీవ్రంగా ఖండించారు.

వ్యర్థమైనట్టి ప్లాస్టిక్కు వాడుతున్న
ముప్పు వాటిల్లుచుండునుతప్పకుండ
ప్రగతి శూన్యమ్ముగా మారు ప్రాణుల కిక
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 34)

ప్లాస్టిక్ కాలుష్యం అనేది పర్యావరణానికి క్యాన్సర్ లాంటిది. ఇది కేవలం నేలను పాడుచేయడమే కాదు, సమస్త జీవకోటి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుంది. మనం సాధించే అభివృద్ధి (ప్రగతి) అంతా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతే అది శూన్యమే అవుతుందని దార్ల వారు అత్యంత శాస్త్రీయ దృక్పథంతో విశదీకరించారు. ప్లాస్టిక్ రహిత సమాజమే నిజమైన ప్రగతికి సూచిక అని ఈ పద్యం చాటిచెబుతోంది.

2. బౌద్ధ తత్వం – అంతరంగ శోధన, శాంతి మార్గం:

అణుబాంబులతో ప్రపంచాన్ని భయపెడుతున్న దేశాలు, మారణాయుధాలతో శాంతిని వెతుకుతున్న పాలకులు ఉన్న ఈ కలికాలంలో బుద్ధుడు చూపిన మార్గం ఎంత అవసరమో కవి గుర్తుచేస్తున్నారు. ద్వేషాన్ని ద్వేషంతో జయించలేమని, రక్తం మరకలను రక్తం కడిగివేయలేదని, కేవలం అహింస, శాంతి మాత్రమే ప్రపంచాన్ని రక్షించగలవని కవి బలంగా విశ్వసిస్తున్నారు.

కత్తి పట్టక శాంతికై కలయ జూచి
మౌన వ్రతమున సాధించి మాన వాళి
కంద జేసెను బుద్ధుడు నంద ముగను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (పద్యం: 122)

యుద్ధాలతో సాధించేది శ్మశాన శాంతి మాత్రమేనని చరిత్ర రుజువు చేసింది. కత్తి పట్టకుండా, అహింసను ఆయుధంగా మలచుకుని బుద్ధుడు మానవాళికి అందించిన 'మౌనం' అనే ఆయుధం ఎంత శక్తివంతమైనదో కవి వివరిస్తున్నారు. బుద్ధుని బోధనలు నేటి హింసాత్మక ప్రపంచానికి ఏకైక పరిష్కారమని, శాంతి మార్గంలోనే మానవాళి మనుగడ సాధ్యమని కవి ఈ పద్యం ద్వారా ఉద్బోధిస్తున్నారు.

నేటి కార్పొరేట్ ప్రపంచంలో మనిషి కోరికలకు అంతం లేకుండా పోయింది. ఒకటి దక్కితే మరొకటి కావాలనే తపనతో, ఎండమావుల వెంట పరుగెడుతూ మనిషి తనశ్శాంతిని కోల్పోతున్నాడు. ఎంత సంపాదించినా తృప్తి లేని బ్రతుకు వ్యర్థమని, ఆశే దుఃఖానికి మూలమన్న బుద్ధుని సత్యాన్ని విస్మరిస్తున్న ఆధునిక మానవుడికి ఇది కనువిప్పు.

అంత మెరుగమీ కోర్కెల నవనియందు
తీర దీదాహ మేనాడు తృప్తిగాను
నాశ వీడిన నౌనగూరు హాయి మనకు
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 120)

కోరికల దాహం సముద్రం లాంటిది, అది ఎప్పటికీ తీరదు. "నాశ వీడిన నౌనగూరు హాయి" అని కవి చెప్పిన మాటలో ఎంతో తాత్త్వికత దాగి ఉంది. తృష్ణను (మితిమీరిన కోరికను) జయించినవాడే నిజమైన సుఖశాంతులను పొందుతాడని, సంతృప్తికి మించిన సంపద లేదని బౌద్ధ తత్వాన్ని కవి తేటగీతిలో ఒంపి సామాన్యులకు అందించారు.

మనిషి ఎలా బ్రతకాలి? అనే ప్రశ్నకు బౌద్ధం చూపిన అద్భుతమైన మార్గం 'అష్టాంగ మార్గం'. కానీ నేడు మాటలో నిజాయితీ, చూపులో పవిత్రత, నడతలో స్వచ్ఛత లోపించాయి. సరైన జీవన విధానాన్ని మరిచిపోయి గందరగోళంలో పడిపోతున్న యువతకు, బౌద్ధం చూపిన ఎనిమిది మార్గాలను కవి ఈ పద్యం ద్వారా పరిచయం చేస్తున్నారు.

చూపు తోపాటువాక్కునుశుద్ధినడత
బ్రతుకు శ్రమయును స్మృతియును ధ్యాన
మొప్పు నష్టాంగ మార్గమం దొదిగి యుండు
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 128)

సమ్యక్ దృష్టి, సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ మొదలైన క్లిష్టమైన పారిభాషిక పదాలను వాడకుండా... చూపు, వాక్కు, నడత అంటూ సామాన్యుడి భాషలో అష్టాంగ మార్గాలను కవి వివరించిన తీరు అద్భుతం. మనిషిని సంపూర్ణ మానవుడిగా (Complete Human Being) తీర్చిదిద్దడానికి ఈ ఎనిమిది సూత్రాలు ఎలా ఉపయోగపడతాయో కవి నిర్దేశిస్తున్నారు.

3. అంబేద్కర్ స్ఫూర్తి – సామాజిక సమతా భావం:

డా.బి.ఆర్.అంబేద్కర్ గారు జీవితాంతం కుల నిర్మూలన కోసం పోరాడి, అంతిమంగా సామాజిక సమానత్వం, సౌభ్రాతృత్వం ఎక్కడైతే దొరుకుతాయో ఆ బుద్ధుని మార్గాన్ని (బౌద్ధ ధర్మాన్ని) స్వీకరించారు. మనిషిని మనిషిగా గౌరవించే బౌద్ధం ద్వారానే భారతీయ సమాజంలో పాతుకుపోయిన అసమానతలు తొలగిపోతాయని ఆయన బలంగా విశ్వసించారు. అంబేద్కర్ గారి ఆ అంతిమ ఆశయాన్ని, ఆయన ఎంచుకున్న శాంతియుత సమతా మార్గాన్ని ఆచార్య దార్ల గారు ఈ పద్యంలో ప్రతిబింబించారు. మనుషుల మధ్య కులమతాల అంతరాలు నశించి, సమానత్వం వెల్లివిరియాలంటే ఏ మార్గంలో నడవాలో కవి ఇక్కడ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

మాన్యుడైనట్టి బుద్ధుని మార్గమైన
ధర్మ పథమును వీడక తరలు చున్న
సమత మమతలు తప్పక సాధ్యమగును

దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 126)

ఈ పద్యంలో కవి వాడిన 'సమత' (సమానత్వం), 'మమత' (ప్రేమ/సౌభ్రాతృత్వం) అనే రెండు పదాలు రాజ్యాంగంలో అంబేద్కర్ గారు పొందుపరిచిన మూల స్తంభాలు. పూజ్యుడైన బుద్ధుడు చూపిన ధర్మ పథంలో నడిచినప్పుడే, సమాజంలో కుల మతాల అడ్డుగోడలు కూలిపోయి ప్రతి ఒక్కరికీ సామాజిక న్యాయం దక్కుతుందని కవి ఘంటాపథంగా చెబుతున్నారు. చట్టాల ద్వారా వచ్చే సమానత్వం కంటే, మనుషుల మనసుల్లో వచ్చే మార్పు ద్వారానే నిజమైన 'సమత' సాధ్యమవుతుందన్న చారిత్రక సత్యాన్ని దార్ల వారు తేటగీతిలో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా అందించారు. ఇది అంబేద్కర్ సమతా భావజాలానికి అక్షర నీరాజనం లాంటి పద్యం.

ఓట్ల కోసం, సీట్ల కోసం రాజకీయ నాయకులు కులాన్ని, మతాన్ని వాడుకోవడం మనం నిత్యం చూస్తున్నాం. ప్రజల మధ్య చిచ్చుపెట్టి చలికాచుకునే కుటిల రాజకీయాలను కవి అసహ్యించుకుంటున్నారు. అధికారం కోసం సమాజాన్ని విడదీయడం కాదు, లోక హితం కోసం అందరినీ కలపడమే నిజమైన నాయకత్వ లక్షణమని కవి హెచ్చరిస్తున్నారు.

కులము మతభేదములపేర కుటిలమెపుడు

నెంచవలదయ్య ప్రజలలోనెవ్వరైన

లోకహితమునుకోరాలిప్రాకటముగ

దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 80)

కులమతాల పేరుతో చేసే రాజకీయం కుటిలమైనది. అది సమాజానికి ఎప్పటికీ చేటు చేస్తుంది. ఏ వ్యక్తి అయినా, ఏ నాయకుడైనా స్వార్థం విడనాడి, లోక కల్యాణాన్ని కాంక్షించాలని కవి ప్రబోధిస్తున్నారు. అంబేద్కర్ గారు చెప్పినట్లుగా సామాజిక ఐక్యత లేనిదే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదని కవి ఈ పద్యం ద్వారా గుర్తుచేస్తున్నారు.

ప్రజాస్వామ్యంలో పాలకులు ప్రజలందరినీ సమానంగా చూడాలి. కానీ పక్షపాత ధోరణి, వివక్ష రాజ్యమేలుతున్న రోజులివి. రాజ్యాంగం ప్రసాదించిన 'సమానత్వపు హక్కు' (Right to Equality) పాలకుల ఆచరణలో కనిపించాలని, అప్పుడే అది రామరాజ్యం అవుతుందని కవి పాలకులకు హితవు పలుకుతున్నారు.

తారతమ్యము చూపక పౌరజనుల

నేలు చున్నను యేలికల్ మేలు కలిగి

సరిగ సమరత భావన సంతరించు

దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 78)

పాలకులు ప్రజల మధ్య తారతమ్యాలు (తేడాలు) చూపకుండా, అందరినీ తమ బిడ్డల్లాగా సమానంగా చూసుకోవాలి. అప్పుడే ఆ పాలన సార్థకమవుతుంది. "సమరత భావన" అంటే అందరినీ సమానంగా ఆదరించే గుణం. ఇదే నిజమైన సామాజిక న్యాయం (Social Justice) అని దార్ల వారు చాటి చెబుతున్నారు. పాలకుల బాధ్యతను గుర్తుచేసే రాజనీతి పద్యం ఇది.

4. కుటుంబ బంధాలు – మానవ సంబంధాల మాధుర్యం:

నేడు ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైపోయాయి. పిల్లలు ఉద్యోగాల పేరుతో విదేశాలకు ఎగిరి పోతుంటే, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు అనాథల్లా మిగిలిపోతున్నారు. వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయంటే మనలోని మానవత్వం చచ్చిపోతోందని అర్థం. నవమాసాలు మోసి, సాకిన తల్లిదండ్రులను భారంగా భావించే ప్రబుద్ధులకు కవి కన్నీటితో రాసిన లేఖ ఈ పద్యం.

సరిగ నవమాసములుమోసి మురిపమంది

పేగు బంధాన్ని తృప్తిగా పెంపుజేసె

తల్లి దండ్రిని వీడుట తగదు తగదు

దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 12)

"వీడుట తగదు తగదు" అని కవి రెండు సార్లు నొక్కి చెప్పడంలో ఆయన ఆవేదన అర్థమవుతుంది. పేగు బంధం తెంచుకుని పుట్టిన మనం, ఆ బంధాన్ని చివరిదాకా నిలుపుకోవాలి. తల్లిదండ్రుల సేవలోనే నిజమైన పుణ్యం ఉందని, వారిని వదిలేయడం క్షమించరాని నేరమని కవి ఘోషిస్తున్నారు. కుటుంబ విలువలను కాపాడటంలో ఈ పద్యం ఒక మైలురాయి.

కుటుంబంలో తండ్రి పాత్ర తరచుగా మరుగున పడిపోతుంది. కానీ తన రక్త మాంసాలను కరిగించి, పిల్లల భవిష్యత్తు కోసం నిచ్చెనగా మారే త్యాగశీలి తండ్రి. ఆ తండ్రి పట్ల కొడుకులకు ఉండాల్సిన గౌరవాన్ని, కృతజ్ఞతా భావాన్ని కవి ఈ పద్యంలో

ఎంతో గొప్పగా చిత్రించారు. తండ్రి అడుగుజాడల్లో నడవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి.

తండ్రి వలెనన్ను సాకిన త్యాగ శీలి
అండ దండగా నిలిచెడి యన్న లున్న
అడుగు జాడలన్ విడువక నడుచుకొనుము
దారి చూపించు నట్టిది దార్ల మాట! (పద్యం: 14)

తండ్రి ఒక వ్యక్తి కాదు, ఒక వ్యవస్థ. కుటుంబ భారాన్ని మోసే ఆ త్యాగశీలిని విస్మరించకూడదు. అలాగే అన్నదమ్ములు తండ్రిలాగే అండదండగా నిలవాలని, పెద్దల బాటలో నడవడమే సంస్కారమని కవి వివరిస్తున్నారు. తండ్రి గొప్పతనాన్ని, సోదర బాధ్యతను ఇంత అద్భుతంగా చెప్పడం దార్ల వారికే చెల్లింది.

ఆస్తి తగాదాలతో సొంత అన్నదమ్ములే కోర్టుల మెట్లు ఎక్కుతున్న దౌర్భాగ్యపు రోజులివి. చిన్న చిన్న కారణాలకు విడిపోతూ, శత్రువులకు చులకన అవుతున్నారు. "ఐకమత్యమే మహాబలం" అనే సూత్రాన్ని మరిచిపోతున్న సోదరులకు, కలిసి ఉంటే కలిగే బలాన్ని, విడిపోతే వచ్చే నష్టాన్ని కవి ఈ పద్యం ద్వారా గుర్తుచేస్తున్నారు.

కష్ట కాలాన తోడుగా కలిసి మెలిసి
మెలగు చున్నను తప్పక మేలుకలుగు
అన్నదమ్ముల బంధమ్ము హాయి కూర్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 15)

కష్టకాలంలో మనకు నిజమైన అండ తోబుట్టువులే తప్ప బయటివారు కాదు. అన్నదమ్ములు కలిసి ఉంటే ఆ కుటుంబం ఎంతో బలంగా ఉంటుంది. ఆ అనుబంధం ఇచ్చే మానసిక ధైర్యం (Moral Support) వెలకట్టలేనిది. విడిపోవడం బలహీనత అయితే, కలిసి ఉండటం గెలుపుకు సంకేతం అని కవి ఈ పద్యంలో ఉద్ఘాటిస్తున్నారు.

5. విద్యా వైశిష్ట్యం – గురు దేవుల ప్రాధాన్యత:

టెక్నాలజీ యుగంలో సమాచారం కోసం గూగుల్ ను ఆశ్రయిస్తున్నాం, కానీ సంస్కారం కోసం గురువును వెతకడం మానేశాం. కేవలం మార్కులు, ర్యాంకుల కోసమే చదువు అనే అపోహలో ఉన్న నేటి తరానికి... అసలైన విద్య అంటే ఏమిటి? గురువు

స్థానం ఎంత గొప్పది? అనే విషయాలను కవి కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు.

గురువు నేర్పిన విద్యను మరువకెపుడు
జ్ఞాన దీపము వెలిగించు నవనియందు
నిత్యవిద్యార్జన పరుడె నిశ్చయముగ
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 24)

గురువు వెలిగించేది అక్షరాలనే దీపాన్ని మాత్రమే కాదు, జీవితం అనే జ్ఞాన దీపాన్ని. గురువు నేర్పిన విద్యను మరువని వాడు, నిత్యం కొత్త విషయాలను నేర్చుకునే వాడు (నిత్య విద్యార్థి) మాత్రమే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడు. గురు భక్తి లేని విద్య నిష్ప్రయోజనం అని వేమన స్ఫూర్తితో దార్ల వారు చెబుతున్నారు.

బడికి వెళ్లడం అంటే బరువు బాధ్యతగా భావించే పిల్లలు కొందరైతే, పుస్తకం పట్టడమే నామోషీగా భావించే వారు మరికొందరు. కానీ పాఠశాలలే బ్రతుకు బాటను చూపే దేవాలయాలని, పుస్తకాలే మెదడుకు పదును పెట్టే ఆయుధాలని కవి వివరిస్తున్నారు. వినయం లేని విద్య సువాసన లేని పువ్వు లాంటిదని కవి హెచ్చరిస్తున్నారు.

పాఠశాలలు చూపించు బ్రతుకు బాట
మస్తకమును పెం పొందించు పుస్తకములు
వినయ విధేయతలునున్న విజ్ఞు డకును
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 25)

చదువు మనిషికి కేవలం ఉద్యోగాన్ని ఇవ్వడమే కాదు, బ్రతుకు తెరువును, జీవన మార్గాన్ని చూపిస్తుంది. పుస్తకాలు చదవడం వల్ల మస్తకం (మెదడు) వికసిస్తుంది. అయితే ఎంత జ్ఞానం సంపాదించినా, వినయ విధేయతలు లేకపోతే ఆ వ్యక్తి విజ్ఞుడు కాలేడు. "విద్యా దదాతి వినయం" అనే ఆర్యోక్తిని కవి ఈ పద్యంలో సమర్థించారు.

డబ్బుంటే ఏదైనా కొనవచ్చు అనుకుంటారు, కానీ విజ్ఞానాన్ని కొనలేరు. కోట్లు సంపాదించినా, చదువు అనే ఆస్తి లేకపోతే సమాజంలో గౌరవం ఉండదు. అక్షరాభ్యాసం అనేది మనిషికి రెండవ జన్మ లాంటిది. అక్షరం గొప్పతనాన్ని, చదువు విలువను ధనంతో పోల్చి చూపిస్తూ కవి రాసిన అద్భుతమైన పద్యం ఇది.

అక్ష రాభ్యాస మందించు నమృత మిలనూ

శాశ్వ తమ్ముగ జీవిక సఫల మగును
అర్థ మెంతేని కూర్చిన వ్యర్థ మగును
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 86)

అక్షరం అమృతం లాంటిది, అది మనిషిని చిరంజీవిని చేస్తుంది. భౌతిక సంపద (అర్థం) ఎప్పటికైనా ఖర్చయిపోతుంది లేదా దొంగల పాలవుతుంది. కానీ విద్యా సంపదను ఎవరూ దొంగిలించలేరు, అది పంచేకొద్దీ పెరుగుతుంది. డబ్బు సంపాదన కంటే జ్ఞాన సంపాదన మిన్న అని కవి ఎంతో స్పష్టంగా తెలియజేశారు.

6. మాతృభాషాభిమానం – అమ్మ భాష అమృతం:

గ్లోబలైజేషన్ మోజులో పడి మమ్మీ డాడీ సంస్కృతికి అలవాటు పడ్డాం. అమ్మ అని పిలవడంలో ఉన్న కమ్మదనాన్ని, మాతృభాషలో మాట్లాడటంలో ఉన్న ఆత్మీయతను మర్చిపోతున్నాం. పరభాషను నేర్చుకోవడం తప్పు కాదు, కానీ కన్నతల్లి లాంటి మాతృభాషను చంపేసుకోవడం నేరం అని కవి ఆవేదన చెందుతున్నారు.

మాతృభాష యే నిరతము మమత పంచు
అమృత తుల్యమై నిక్కమ్ము నాదరించు
అమ్మ యనుమాట చెవులకు కమ్మ నగును
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 88)

"అమ్మ" అనే పిలుపులో ఉన్న మాధుర్యం ప్రపంచంలో మరే భాషలోనూ దొరకదు. మాతృభాష మన భావాలకు ప్రాణం పోస్తుంది, మనసులోని మమతను పంచుతుంది. అది అమృతంతో సమానమైనది. మాతృభాషను ఆదరించడం అంటే మనల్ని మనం గౌరవించుకోవడమే అని కవి ఎంతో ఆర్ద్రతతో పలికారు.

భాష అనేది కేవలం భావప్రకటన సాధనం మాత్రమే కాదు, అది ఒక జాతి అస్తిత్వం (×ఎవత్‌ఉఎ). భాష నశిస్తే ఆ జాతి సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతాయి. మన భాషను మనమే కాపాడుకోకపోతే, భవిష్యత్ తరాలకు మన చరిత్రే తెలియకుండా పోతుంది. మాతృభాష జాతి గౌరవానికి చిహ్నం అని కవి గళమెత్తి చాటుతున్నారు.

అమ్మ భాషయమృత మయ్యి యవనియందు

నమర పదమున నిలుపు తా నాదరమున
జాతి గౌరవ చిహ్నమై జయము కలుగు
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 101)

మన భాషను మనం అమరపదంలో (ఉన్నత స్థానంలో) నిలుపుకోవాలి. మాతృభాష అభివృద్ధి చెందితేనే ఆ జాతికి జయం కలుగుతుంది. పరాయి భాషల మోజులో పడి సొంత భాషను నిర్లక్ష్యం చేస్తే, జాతి గౌరవం మసకబారుతుందని దార్ల వారు హెచ్చరిస్తున్నారు. భాషాభిమానం ప్రతి పౌరుడికి ఉండాల్సిన ప్రథమ లక్షణం.

సోషల్ మీడియాలో ట్రోలింగ్స్ (Trolling), బూతులు మాట్లాడటం ఈ రోజుల్లో ఫ్యాషన్ గా మారింది. కానీ నోరు జారితే వెనక్కి తీసుకోలేం. మనిషి సంస్కారం అతని మాటతీరులోనే బయటపడుతుంది. మృదువుగా మాట్లాడేవాడికి శత్రువులు ఉండరని, మాట మంచిదైతే ఊరు మంచిదవుతుందని కవి యువతకు దిశానిర్దేశం చేస్తున్నారు.

నోరు మంచిది యైనచో నూరియందు
శాంతిసౌఖ్యమ్ములనుపొంది సాగుచుండు
సరిగ మమతాను రాగాలు సంతరించు
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 107)

మన మాట తీరే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కఠినంగా మాట్లాడి శత్రువులను పెంచుకోవడం కంటే, ప్రేమగా మాట్లాడి అందరినీ ఆత్మీయులుగా చేసుకోవడం మిన్న. వాక్శుద్ధి, మృదుభాషణం వల్ల సమాజంలో శాంతి సౌఖ్యాలు వర్ధిల్లుతాయని, అదే నిజమైన నాగరికత అని కవి గొప్ప సందేశాన్ని ఇస్తున్నారు.

7. నైతిక విలువలు – సత్యనిష్ఠ, వాక్శుద్ధి:

ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వారు నేడు కరువయ్యారు. వాగ్దానాలు చేయడం, ఆ తర్వాత వాటిని తుంగలో తొక్కడం పరిపాటిగా మారింది. కానీ పూర్వీకులు మాటకు ప్రాణం ఇచ్చేవారు. ఒక మనిషికి, లేదా ఒక వంశానికి నిజమైన గౌరవం ఆస్తిపాస్తుల వల్ల రాదు, సత్యం మాట్లాడటం వల్లే వస్తుందని కవి నొక్కివక్కాణిస్తున్నారు.

వంశ గౌరవ మన్నది వాక్కు తోడ
సత్యమెప్పుడు వీడక సాగవలెను

మాట తప్పని వానికి మన్ననబ్బు

దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 11)

"మాట తప్పని వాడు" అనే బిరుదు సంపాదించడం అంత సులభం కాదు. హరిశ్చంద్రుడు వంటి సత్యవాదులను మనం ఆదర్శంగా తీసుకోవాలి. ఎన్ని కష్టాలు వచ్చినా సత్యాన్ని విడవకూడదని, మాట మీద నిలబడేవారికే సమాజంలో శాశ్వతమైన మన్నన (గౌరవం) దక్కుతుందని కవి స్పష్టం చేస్తున్నారు.

అబద్ధాలతో, అక్రమ మార్గాల్లో గెలిచే వాడిని చూసి మనం నిరాశపడకూడదు. ధర్మం ఎప్పుడూ ఆలస్యంగానే గెలుస్తుంది, కానీ కచ్చితంగా గెలుస్తుంది. న్యాయమార్గంలో నడిచేవాడే నిజమైన సజ్జనుడు. తాత్కాలిక విజయాల కోసం అడ్డదారులు తొక్కకూడదని కవి నేటి యువతకు ప్రబోధిస్తున్నారు.

సత్య వాక్కును మరువడు సజ్జనుండు

న్యాయమార్గమే జీవిత ధ్యేయమగును

ధర్మమేగెల్చి నిలబడు ధరణియందు

దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 23)

సత్యం మాట్లాడేవాడు సజ్జనుడు. న్యాయమే అతని జీవిత ధ్యేయం కావాలి. "ధర్మమే జయిస్తుంది" (సత్యమేవ జయతే) అనేది భారతీయ సంస్కృతి నేర్పిన పాఠం. ఎన్ని ప్రలోభాలు వచ్చినా ధర్మపక్షాన నిలబడటమే దార్ల మాట సారాంశం.

మోసంతో బ్రతకడం ఒక తెలివితేటలుగా భావిస్తున్న రోజులివి. అబద్ధాలతో ప్రపంచాన్ని నమ్మించవచ్చు అనుకుంటారు కానీ, అది ఎంతో కాలం దాగదు. పునాది లేని ఇల్లు ఎలా కూలిపోతుందో, అబద్ధం మీద కట్టిన బ్రతుకు కూడా అలాగే కుప్పకూలుతుందని కవి హెచ్చరిస్తున్నారు.

బ్రతికి యున్నంతకాలమబద్ధమాడి

యేమి సాధించలేవు నీవెచటనైన

నిజము వెలుగొందుచుండును నిక్కమిదియె

దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 91)

అబద్ధానికి ఆయుష్షు చాలా తక్కువ. జీవితాంతం అబద్ధాలు ఆడుతూ బ్రతికినా

చివరకు సాధించేది శూన్యం. చీకటిని చీల్చుకుని సూర్యుడు ఎలా వస్తాడో, అబద్ధాలను ఛేదించుకుని నిజం ఎప్పటికైనా బయటపడుతుంది. సత్యానికి ఉన్న శక్తిని నమ్మి బ్రతకడమే ఉత్తమ మార్గమని కవి ఘంటాపథంగా చెబుతున్నారు.

8. సామాజిక బాధ్యత – దానగుణం, పరోపకారం:

బ్యాంక్ బ్యాలెన్సులు పెంచుకోవడమే జీవిత ధ్యేయంగా బ్రతుకుతున్న లోభులు మన మధ్య ఎందరో ఉన్నారు. పక్కవాడు ఆకలితో అలమటిస్తుంటే కనీసం జాలిపడని రాతి గుండెలు తయారయ్యాయి. ప్రకృతిలో నదులు, చెట్లు పరోపకారం చేస్తుంటే, మనిషి మాత్రం స్వార్థంతో బ్రతుకుతున్నాడని కవి ఈసడిస్తున్నారు.

దాన గుణశీలురే నాడుదాచు కొనరు

పంచిపెట్టరే నిరుపేదప్రజలకెపుడు

ఇవ్వ బూనున లోభివాడెప్పుడైన?

దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 66)

సంపదకు సార్థకత దానంలోనే ఉంది. దాచుకుంటే అది పెరగదు, పంచుకుంటే తరిగిపోదు. దానగుణశీలురు తమ దగ్గర ఉన్నది నలుగురికీ పంచడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటారు. కానీ లోభికి ఇవ్వాలనే ఆలోచనే రాదు. సమాజం మనకు ఎంతో ఇచ్చింది, మనం తిరిగి సమాజానికి ఎంతో కొంత ఇవ్వాలి అనే సామాజిక బాధ్యతను కవి గుర్తుచేస్తున్నారు.

మన చుట్టూ వందల మంది స్నేహితులు ఉండవచ్చు, సోషల్ మీడియాలో వేల మంది ఫాలోవర్లు ఉండవచ్చు. కానీ ఆపద వచ్చినప్పుడు ఒక్కడు కూడా పక్కన ఉండడు. సుఖంలో ఉన్నప్పుడు వచ్చేవాడు కాదు, కష్టంలో ఉన్నప్పుడు కన్నీళ్లు తుడిచేవాడే నిజమైన స్నేహితుడని కవి మిత్రధర్మాన్ని నిర్వచించారు.

ఆపదెదురైన వెంటనే యాదు కొనెడి

మిత్రవర్యులన్ హృదినిల్పి మెలగ వలయు

అంతరంగాన నెలకొల్పెదద్దముగను

దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 22)

ఆపదలో ఆదుకునే మిత్రుడు దేవుడితో సమానం. అలాంటి వారిని గుండెల్లో

(హృదిలో) పెట్టుకుని పూజించాలి. అద్దం మన రూపాన్ని ఎలా నిజాయితీగా చూపిస్తుందో, నిజమైన మిత్రుడు కూడా మన తప్పుఒప్పులను అలాగే చెప్పి సరిదిద్దుతాడు. అలాంటి సన్మిత్రులను సంపాదించుకోవడమే నిజమైన ఆస్తి.

"పరోపకారార్థం ఇదం శరీరం" అంటారు పెద్దలు. తన కోసం తాను బ్రతికేవాడు స్వార్థపరుడు, ఇతరుల కోసం బ్రతికేవాడే త్యాగధనుడు. సమాజంలో అట్టడుగు వర్గాలను, దీనులను ఆదరించడమే మానవ జన్మకు పరమార్థం అని, సేవాభావమే మనిషిని మహనీయుడిని చేస్తుందని కవి ఈ పద్యంతో ముగించారు.

దీన జనులను దరిచేర్చి తృప్తి కూర్చు
పర హితమ్మును కోరిన ప్రాకటముగ
త్యాగ శీలమ్ము నీదని తలచుదురయ
దారి చూపించు నట్టిది దార్ల మాట (పద్యం: 100)

ఏ దిక్కూ లేని దీనులను చేరదీసి ఆదరించడంలోనే నిజమైన తృప్తి ఉంది. పరుల హితాన్ని కోరేవాడే ప్రాజ్ఞుడు. త్యాగంలో ఉన్న ఆనందం భోగంలో ఉండదు. మానవ సేవయే మాధవ సేవ అని నమ్మి, తోటి మనిషికి సాయపడటమే దార్ల మాట సారాంశం. ఈ సేవా గుణమే రేపటి సమాజానికి దారి చూపిస్తుందని కవి ఆకాంక్ష.

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి "దార్ల మాట తేటగీతి శతకం" సమకాలీన సామాజిక దార్శనికతకు గీటురాయి. ఈ అద్భుతమైన గ్రంథానికి నాలుగు మాటలు రాసే అదృష్టం నాకు దక్కినప్పటికీ, నాకున్న పరిమితమైన సాహిత్య పరిజ్ఞానం మేరకు ఇందులో ఉన్న కొన్ని పద్యాలను మాత్రమే నేను విశ్లేషించగలిగాను.

నిజం చెప్పాలంటే, ఈ శతకంలోని ఒక్కొక్క పద్యం ఒక్కొక్క ఆణిముత్యం. ఏ ఒక్క పద్యాన్నీ వదిలి వేయాలని నాకు అనిపించలేదు. నా విశ్లేషణలో ఎన్నో అద్భుతమైన పద్యాలను వదిలివేయాల్సి రావడం నా మనసుకు ఎంతో బాధను కలిగించింది. సత్కవిత్వానికి ఉన్న గొప్ప లక్షణం ఏమిటంటే– ఒక పద్యాన్ని వంద మంది చదివితే, వారి వారి అనుభవాలను బట్టి వంద రకాల తాత్విక కోణాలు ఆవిష్కృతమవుతాయి. ఈ శతకంలోని ఒక్క పద్యమే వంద మందికి వంద రకాల జీవిత సత్యాలను బోధిస్తుంది. అంతటి గొప్ప మానవీయ, సామాజిక తాత్వికత ఈ పద్యాల్లో నిక్షిప్తమై ఉంది.

ఒక మనిషికి ఎంత ఆకలి వేసినా, అతని ముందు పంచభక్ష్య పరమాన్నాలు ఎన్ని ఉన్నా, కడుపు నిండగానే అతడు ఆగిపోతాడు. అంతమాత్రాన అక్కడ వడ్డించి ఉన్న రుచికరమైన పదార్థాల విలువ, రుచి ఏమాత్రం తగ్గిపోదు. ఆ తర్వాత ఎంతమంది వచ్చినా, ఆ పదార్థాలు వారి ఆకలిని తీరుస్తూనే ఉంటాయి. ఈ "దార్ల మాట తేటగీతి శతకం" కూడా సరిగ్గా అలాంటి అమృత భాండమే! నాకున్న పరిధి మేరకు కొన్ని పద్యాలను మాత్రమే విశ్లేషించి నా సాహిత్యపు ఆకలిని నేను తీర్చుకున్నాను. కానీ, ఈ గ్రంథంలో నేను స్పృశించని పద్యాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. అవన్నీ పదే పదే చదివే కొద్దీ పాఠకుల సాహిత్య దాహాన్ని, జ్ఞాన పిపాసను ఎప్పటికీ తీరుస్తూనే ఉంటాయి.

నేను చేసిన ఈ విశ్లేషణ కేవలం ఒక ఆరంభం, ఒక చిన్న పరిచయం మాత్రమే. ఇక ఈ పద్యాలను చదివి, ఆస్వాదించి, వాటిలోని లోతైన తాత్వికతను అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత, భాగ్యం ఇకపై పాఠకులైన మీ అందరిదే! ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న రుగ్మతలకు కవి తన పద్యాల ద్వారా అద్భుతమైన చికిత్సను అందించారు. ఈ శతకం వేమన లోకజ్ఞానాన్ని, అంబేద్కర్ సామాజిక న్యాయాన్ని, బౌద్ధంలోని శాంతిని పుణికిపుచ్చుకుని యువతకు ఒక కరదీపికలా దారి చూపిస్తోంది.

నా దార్లన్న కలం నుండి జాలువారిన ఈ 'దార్ల మాట తేటగీతి శతకం' తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ముమ్ముందు ఆయన కలం నుండి ఇలాంటి ఆణిముత్యాలు మరెన్నో పుట్టుకురావాలని,

సహృదయ స్పందన

జి.గోవర్ధన్
తెలుగు లెక్చరర్,
ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల
మహబూబ్ నగర్, చరవాణి: 8106384812

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు వ్రాసిన తన శతకాన్ని పరిశీలించండి అని పిడిఎఫ్ పంపించడం నాపై చూపిస్తున్న అభిమానానికి నిదర్శనం.

వీరువ్రాసిన తేటగీతి పద్యాలను దార్ల మాట శతకముగా సమాజానికి అందించ దలచి.ఈ పద్యాలను ఒకసారి పరిశీలించాలని సూచించడం నేనొక అదృష్టం గా భావించాను. ఈ విధంగా భావించడానికి కారణం లేకపోలేదు. ఏకవియైనా కవితలు,లేదా పద్యాలను వ్రాసేక్రమమంలో సహజంగా దొర్లే చిన్న చిన్న దోషాలను అంతగా గమనించరు. వచన కవిత్వానికి పద్యం మాదిరి సూత్రాలు, యతి ప్రాసలు ఉండవు కాబట్టి పెద్దగా ఇబ్బందేమీ ఉండదు.పద్యంలో మాత్రం నియమాలను తప్పకుండా పాటించి తీరాలి. నేను పద్యరచన పై ఉన్న కుతూహలం తో ప్రతిరోజూ వీలైనప్పుడల్లా కనీసం ఒకపద్యమైనా వ్రాయ కుండా ఉండలేననే విషయం అతిశయోక్తి ఏమాత్రం కాదు. పద్య రచన చేస్తున్నప్పుడు ఊహాలోకంలో తేలియాడుతూ భావంపై దృష్టి పెట్టడం వలన కొన్ని సందర్భాల్లో యతి,ప్రాస గణాలను అంతగా గమనించకుండా పద్యం ముందుకు కదులుతుంది. ఈవిషయం పద్యకవులకు అనుభవైకవేద్యమే. ఆచార్య దార్ల వారు వ్రాసిన తేటగీతి పద్యాలు పిడిఎఫ్ చేసి పంపించారు.పద్యంపై ఉన్న ఆసక్తితో ప్రతి పద్యాన్ని పరిశీలిస్తూ నా దృష్టికి వచ్చిన మెరికెల లాంటి చిన్న చిన్న దోషాలను ఆచార్య దార్ల వారి దృష్టికి తెచ్చి వారి భావములో ఏమాత్రం మార్పులేకుండా అక్కడక్కడ ఒకటి రెండు పదాలు మాత్రమే మార్పులు చేర్పులు చేసి పద్యాలన్నింటిని తుదిరూపం వచ్చేవిధంగా ప్రయత్నం చేశాము.

ఈవిధంగా పరిశీలించే అవకాశం దొరకడం నేను అదృష్టంగా భావిస్తున్నాను. శతకములో సామాజికాంశాలు చాలా ఉన్నాయి. ఆధునిక సమాజం లో కొనసాగుతున్న

కొంతమంది జీవన విధానంలో ఉన్న లోటుపాట్లను ఎత్తిచూపారు. యువత ప్రవర్తనను, సోమరితనాన్ని ఎత్తి చూపిస్తూ కలిగే దుష్ఫలితాలను ముందుంచారు. కొంత మంది క్రమశిక్షణ రహితంగా, మెలగడం, తల్లి తండ్రి, గురువు, దైవం అనే భావాలను గాలికివదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీటిన్నింటికి పద్యాలలో చొప్పించారు. ధనాన్ని సంపాదించడం కొరకు నీతి, నియమాలు, ధర్మాధర్మాల పట్టింపు ఏమాత్రం లేదు. ప్రజలు కొనుగోలు చేసే ప్రతి వస్తువు, ఆహార పదార్థాలన్నియు కల్తీమయమే. ఈ కల్తీ చేయడం వలన కొనుగోలు దారులు గమనిస్తే వ్యాపారం కుంటుపడుతుందని సూచించారు సామ్రాజ్య విస్తరణ పేరుతో యుద్ధాలు చేయడం దుర్మార్గం. ప్రజలంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లడానికి పరిపాలకులు తగిన చర్యలు, ప్రణాళికలు ఏర్పరచుకుని ముందుకుసాగాలి. బుద్ధం శరణం గచ్ఛామి అంటూ దుఃఖానికి కారణమైన అత్యాశ, కోరికలు అనే పుట్టలో నుండి బయటపడాలని గౌతమి బుద్ధుని ధర్మపథాన్ని సూచించారు.

ఈవిధంగా సమసమాజ స్థాపనకై కులమతాలకు అతీతంగా పరిపాలన ఉండాలని యుద్ధాలు విరమించాలని ఆకాంక్షించారు

కవి మిత్రులు పుస్తకావిష్కరణ సందర్భంగా అభిమానంతో అందించే పుస్తకాలను చిరునవ్వులొలికిస్తూ అందుకుంటారు. ఆ తరువాత మొహమాటానికి రెండు మూడు పద్యాలు చదివి పుస్తకాన్ని ఏమూలకో విసిరేసి ఎప్పుడైనా కవిమిత్రుడు తారస పడినప్పుడు చాలాబాగుంది అంటూ ముఖస్తుతి చేయడం గమనిస్తుంటాము. ఆ పుస్తకం ఇంట్లో ఏ సెల్ఫ్ లోనో లేక టేబుల్ పడేయడమేతప్ప పూర్తిగా చదివేవారు చాలా తక్కువ. ఈ దార్ల మాట శతకం నేను పూర్తిగా చదివే అవకాశం లభించింది. పద్యాలన్నింటిని తీరిక ఉన్నప్పుడల్లా క్షుణ్ణంగా పరిశీలిస్తూ నాకు అప్పచెప్పిన బాధ్యతను శక్తి కొలది నెరవేర్చానని చెప్పగలుగుతున్నాను.

ఈ శతకాన్ని సాహితీప్రియులు చదివి తప్పకుండా తమలో ఉన్న మంచిచెడులు బేరీజు వేసుకుని తప్పకుండా మార్పు కోరుకుంటారని ఆశిస్తున్నాను ఇలాంటి సామాజిక చైతన్యం కలిగించే మరికొన్ని రచనలను సమాజానికి అందించడానికి వీరి కలానికి మరింత పదును పెట్టాలని ఆకాంక్షిస్తున్నాను.

పౌరాణిక దృష్టాంతాల ద్వారా విలువలు ప్రబోధిస్తున్న 'దార్ల మాట' శతకం

- డి. సాయినాథ్ రెడ్డి
సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్
6305584064.

సాహిత్యం కేవలం అక్షర విన్యాసం కాదు; అది ఒక సామాజిక అవసరం. "సహితస్య భావ: సాహిత్యం" అన్నట్లుగా, సమాజానికి మేలు చేసే ఆలోచనల సమాహారమే సాహిత్యం. భారతీయ అలంకార శాస్త్రవేత్తలు సాహిత్య ప్రయోజనాన్ని అద్భుతంగా వివరించారు. ఆచార్య మమ్మటుడు తన కావ్యప్రకాశంలో...

"కావ్యం యశసే2ర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే ।
సద్యఃపరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే ॥"

అని పేర్కొన్నాడు. అంటే కావ్యం వల్ల కీర్తి, ధనం, లోక వ్యవహార జ్ఞానం కలుగుతాయి. అమంగళం తొలగిపోతుంది (శివేతరక్షతయే). అన్నిటికంటే ముఖ్యంగా, ప్రియురాలు చెప్పినట్లుగా హితవును బోధించే 'కాంతాసమ్మిత' ఉపదేశం లభిస్తుంది. మానవుడిని సంస్కరించి, ఉన్నతుడిగా తీర్చిదిద్దడమే సాహిత్య ప్రధాన ప్రయోజనం.

ఈ క్రమంలో తెలుగు సాహిత్యంలో 'శతకం' ఒక శక్తివంతమైన సాధనంగా నిలిచింది. పండితుల నుండి పామరుల వరకు అందరినీ ప్రభావితం చేయగలిగే ప్రక్రియ ఇది. భర్తృహరి తన సుభాషిత త్రిశతి (నీతి శతకం)లో: **"సాహిత్య సంగీత కళా విహీనః సాక్షాత్ పశుః పుచ్ఛవిషాణహీనః ।"** అని పేర్కొన్నాడు. అంటే సాహిత్యం, సంగీతం, కళల పట్ల అవగాహన లేని మనిషి తోక, కొమ్ములు లేని సాక్షాత్ పశువు వంటివాడు. అలాగే హితోపదేశంలో కూడా **"ధర్మేణ హీనాః పశుభిః సమానాః"** అని చెప్పబడింది. అంటే ఆహార నిద్రా భయ మైథునాలు పశువులకు, మనుషులకు సమానమైనప్పటికీ, మనిషిని వివేకవంతుడిగా మార్చే 'నీతి' లేదా 'ధర్మం' లేనివాడు పశువుతో సమానం. ఈ ప్రాచీన నైతిక సూత్రాలనే వర్తమాన కాలానికి అన్వయిస్తూ, నిత్య జీవితంలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితుల్లో మనిషి ఏ మార్గంలో నడవాలో బోధించే బాధ్యతను తెలుగు శతక కవులు

స్వీకరించారు. వేమన, సుమతీ వంటి ప్రాచీన శతకాలు తెలుగువారి నైతిక జీవితాన్ని శతాబ్దాలుగా శాసిస్తూనే ఉన్నాయి.

అయితే, నేటి గ్లోబలైజేషన్ కాలంలో మానవీయ విలువలు అడుగంటుతున్నాయి. సాంకేతికత పెరిగినా సంస్కారం తగ్గుతున్న తరుణంలో, వర్తమాన సామాజిక స్థితిగతులకు అనుగుణంగా కొత్త నీతిని ప్రబోధించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ శూన్యాన్ని పూరిస్తూ, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు తనదైన శైలిలో 'దార్ల మాట' (తేటగీతి) నీతి శతకాన్ని అందించారు. ప్రాచీన విలువలను ఆధునిక జీవనశైలికి అన్వయిస్తూ, సరళమైన భాషలో సమాజానికి ఒక కొత్త దిశానిర్దేశం చేసిన ఈ శతకంపై లోతైన అధ్యయనం నేటి తరం విద్యార్థులకు ఎంతో అవసరం. 2021లో వెలువడిన 'దారి పూలతోట దార్ల మాట' (ఆటవెలది) తర్వాత వచ్చిన ఈ తేటగీతి శతకం, 'దారి చూపించునట్టిది దార్ల మాట' అనే మకుటంతో పాఠకుల అంతఃచ్ఛేతనను మేల్కొల్పుతోంది.

పౌరాణిక గాథలతో కుటుంబ విలువల బోధన

ఈ శతకంలో తల్లిదండ్రుల సేవతో పాటు, 'మంచి మిత్రుడు' ఎలా ఉండాలి అనే విషయానికి పురాణాలలోని శ్రీకృష్ణ-కుచేల సఖ్యాన్ని, 'ధర్మం' విజయానికి ఎలా దారి తీస్తుందో చెప్పడానికి మహాభారత నేపథ్యాన్ని కవి అద్భుతంగా వాడుకున్నారు. కుటుంబంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ఆ వంశానికే వన్నె తెస్తుంది.

వంశ గౌరవ మన్నది వాక్కు తోడ
సత్య మెప్పుడు వీడక సాగ వలయు
మాట తప్పని వానికి మన్ననబ్బు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (11)

ఇది రామాయణంలోని శ్రీరాముని 'ఏక వాక్య' పరిపాలనకు నిదర్శనం. ఇచ్చిన మాట కోసం రాజ్యాన్ని త్యాగం చేయడం వల్ల ఇక్ష్వాకు వంశం చరిత్రలో అమరమైంది. కుటుంబంలో సభ్యులు ఒకరికొకరు నమ్మకంగా, సత్యంతో ఉన్నప్పుడే ఆ వంశం గౌరవించబడుతుందనే పౌరాణిక సత్యాన్ని కవి ఎంతో బలంగా మనసులో నాటుకుపోయేలా చెప్పారు.

మాతృత్వం - త్యాగశీలత

మూర్తిమత్వ వికాసానికి దోహదపడే మాతృప్రేమ యొక్క గొప్పదనాన్ని ఈ శతకంలోని కొన్ని పద్యాలలో చూడవచ్చు.

మాతృ మూర్తిగా నిరతము మమత పంచు
ఆడు బిడ్డల దీవెన లందు కొనిన
వెన్ను దన్నుగా నుండును వృద్ధి యందు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (16)

ఇది భాగవతంలోని శ్రీకృష్ణుని మాతృభక్తిని స్ఫురింపజేస్తుంది. విశ్వమంతా తన నోటిలో ఉన్నా, తల్లి యశోదకు బిడ్డగా లోబడి ఉండటం ఆయన గొప్పతనం. తల్లిని దైవంగా భావించే సంస్కారమే మనిషిని చరిత్రలో మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దుతుందనే భావోద్వేగ సత్యాన్ని కవి ఇక్కడ ఆవిష్కరించారు.

కుటుంబ అనుబంధాలు – నైతిక విశ్లేషణ

తల్లి, తండ్రి, అన్నయ్య, తమ్ముడు, సోదరి, భార్య వంటి కుటుంబ లను సంబంధాలనుఈ శతకంలో చక్కని దృష్టాంతాలతో వివరించడం ఒక విశేషం.

సరిగ నవమాసములుమోసి మురిపమంది
పేగు బంధాన్ని తృప్తిగా పెంపు జేసి
తల్లి తండ్రిని వీడుట తగదు తగదు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (12)

తండ్రి వలెనన్ను సాకిన త్యాగ శీలి
అండ దండగా నిలిచెడి యన్న జూపిన
అడుగు జాడలన్ విడువక నడుచుకొనెద
దారి చూపించు నట్టిది దార్ల మాట! (14)

భారతంలో ధర్మరాజు అడుగుజాడల్లో నడిచిన భీమార్జున నకుల సహదేవుల అనుబంధం ఇక్కడ స్మరణీయం. అన్నను తండ్రిగా భావించే సంస్కారం కుటుంబ సౌభాగ్యానికి మూలం.

కష్ట కాలాన తోడుగా కలిసి మెలిసి
మెలగు చున్నను తప్పక మేలు కలుగు

అన్న దమ్ముల బంధమ్ము హాయి కూర్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (15)

కష్ట సుఖములన్ కనిపెట్టి యిష్ట ముగను
సుఖము సంతోష ములతోడ శుభము కూర్చు
అతివ యర్ధాంగి నెప్పుడు నాద రించు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (17)

అరణ్య వాసంలోనూ శ్రీరాముని వెన్నంటి నిలిచిన సీతమ్మ ఆదర్శం ఇక్కడ కనిపిస్తుంది. భార్యను అర్ధాంగిగా గౌరవించే కుటుంబమే ఆర్థికంగా, సామాజికంగా వృద్ధి చెందుతుంది.

కలిసి మెలసి జీవించిన కలదు సుఖము
ఒంటి రిగనున్న తప్పదు కంట నీరు
ఐక మత్యమే కొండంత నండ నిచ్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (19)

ప్రపంచ యుద్ధాల కాలంలో (1914–1945) ఐక్యత లేని రాజ్యాలు ఎలా కూలిపోయాయో చరిత్ర చెబుతుంది. విభజన వినాశనానికి, ఐక్యత వికాసానికి దారి తీస్తుందని ఈ పద్యం హెచ్చరిస్తుంది.

నమ్మ కముతోడ నిత్యము నడువ వలెను
మోస పుచ్చిన జనులెల్ల మూర్ఖ దనుచు
ముద్ర వేయుట తప్పదు ముఖము ముందు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (20)

సత్యం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన హరిశ్చంద్రుని చరిత్ర ఇక్కడ గొప్ప దృష్టాంతం. కుటుంబ సభ్యుల మధ్య నమ్మకమే అసలైన పునాది.

ప్రేమ పంచిన తప్పక ప్రేమనొందు
శాంతి మార్గము వీడక సాగవలయు
ధర్మ నిరతియే రక్షించు ధరణి నెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (21)

ఇది మహాత్మా గాంధీ (1869–1948) అహింసా సిద్ధాంతాన్ని, "ధర్మో రక్షతి

రక్షితః" అనే పురాణ సూక్తిని మేళవిస్తుంది. ద్వేషం కంటే ప్రేమ శక్తివంతమైనదని, అదే కుటుంబానికి, లోకానికి క్షేమమని ఈ పద్యం సిద్ధాంతీకరిస్తుంది.

నిస్వార్థ స్నేహం – శ్రీకృష్ణ, కుచేల అనుబంధం

మంచి మిత్రుడి లక్షణాన్ని వివరిస్తూ కవి ఒక పద్యాన్ని ఇలా మలిచారు:

ఆప దెదురైన వెంటనే యాదు కొనెడి
మిత్ర వర్యుల హృదయాన నిల్చి మెలగు
అంత రంగము నందున నద్ద ముగను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (22)

భాగవత పురాణంలో శ్రీకృష్ణుడు ద్వారకాధీశుడై ఉండి కూడా, దారిద్ర్యంలో ఉన్న తన బాల్య మిత్రుడు కుచేలుడిని ఆలింగనం చేసుకుని ఆదరిస్తాడు. ఏమీ ఆశించకుండానే మిత్రుడి కష్టాలను తీరుస్తాడు. కవి ఈ పద్యంలో అదే స్ఫూర్తిని పంచుతున్నారు. ధనం, హోదా ఉన్నప్పుడు వచ్చే స్నేహితుల కంటే, ఆపదలో ఉన్నప్పుడు అండగా నిలబడేవాడే 'నిజమైన మిత్రుడు' అని చెప్పడం ద్వారా శ్రీకృష్ణుని స్నేహ ధర్మాన్ని ఇక్కడ స్ఫురింపజేశారు.

ధర్మో రక్షతి రక్షితః – భారతీయ ధర్మ సూత్రం

సత్య వాక్కును మరువడు సజ్జ నుండు
న్యాయ మార్గమే జీవిత ధ్యేయ మగును
ధర్మ మేగెల్చి నిలబడు ధరణి యందు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (23)

ఇందులో "ధర్మో రక్షతి రక్షితః" అనే సుప్రసిద్ధ పౌరాణిక సూత్రం స్పష్టంగా కనిపిస్తుంది. మహాభారత యుద్ధంలో పాండవులు ధర్మ పక్షాన నిలిచారు కాబట్టే, భగవంతుని అండతో విజయం సాధించారు. అధర్మం తాత్కాలికంగా గెలిచినట్లు కనిపించినా, అంతిమంగా ధర్మమే లోకాన్ని కాపాడుతుందనే సనాతన సత్యాన్ని కవి ఇక్కడ నొక్కి చెప్పారు. సత్యమే హరిశ్చంద్రుడికి, ధర్మరాజుకు ఏ విధంగా శక్తిని ఇచ్చిందో, నేటి సామాన్యుడికి కూడా అదే శక్తినవుతుందని కవి విశ్లేషించారు.

గురుశిష్య సంబంధం – గురుదేవోభవ

గురువు ప్రాముఖ్యతను వివరిస్తూ కవి చెప్పిన పద్యంలో గురు బ్రహ్మ తత్త్వం

ధ్వనిస్తుంది.

గురువు నేర్పిన విద్యను మరువ కెపుడు
జ్ఞాన దీపము వెలిగించు నవని యందు
నిత్య విద్యార్జ నపరుడు నిశ్చ యముగ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (24)

పురాణాల్లో ద్రోణాచార్యుడు, వశిష్ఠుడు వంటి గురువుల మార్గదర్శకత్వంలో శిష్యులు ఏ విధంగా అజేయులయ్యారో మనకు తెలుసు. "ఆచార్యదేవోభవ"అనే ఉపనిషత్ వాక్యాన్ని కవి ఇక్కడ పద్య రూపంలో పునరుద్ధరించారు. గురువు కేవలం అక్షరాలు నేర్పేవాడు కాదు, హృదయంలో జ్ఞాన దీపాన్ని వెలిగించే 'సంస్కార ప్రదాత' అని వర్ణించడం ద్వారా భారతీయ సాంస్కృతిక మరియు పౌరాణిక వారసత్వాన్ని కవి చాటి చెప్పారు.

సాంఘికీకరణ ప్రక్రియలో కుటుంబం, పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయం... అత్యంత ముఖ్యమైనవి. ఇక్కడ ఏర్పడిన పునాదులే ఆ వ్యక్తిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దడంలో సహకరిస్తాయి. ఇక్కడ పెరిగిన విధానమే సమాజంలో కనిపిస్తుంది. వ్యక్తిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దే ఈ సామాజిక ప్రక్రియను కవి ఎంతో అద్భుతంగా ఇక్కడ దృష్టాంతీకరించారు.

బాల్యం – పాఠశాల క్రమశిక్షణ (Formal Schooling)

అక్షర జ్ఞానంతో పాటు సామాజిక మర్యాదలను నేర్చుకునే దశ ఇది.

పాఠ శాలలు చూపించు బ్రతుకు బాట
మస్తకమును పెంపొందించు పుస్త కములు
వినయ విధేయత లున్న విజ్ఞు డతడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (25)

ప్రాచీన గురుకులాల్లో విద్యార్థులు సమిధలు సేకరించడం నుండి వేదాధ్యయనం వరకు చేసేవారు. "వినయమున్నచో విద్యయు విలసిలును" అనడంలో 'విద్యా దదాతి వినయం' అనే సంస్కృత సూక్తిని కవి ఇక్కడ సాంఘికీకరణకు పునాదిగా మార్చారు.

కౌమారం – కళాశాల లక్ష్యశుద్ధి (Skill and Focus)

ఈ దశలో విద్యార్థి తన మూర్తిమత్వాన్ని బాహ్య ప్రపంచం నుండి కాపాడుకుంటూ

లక్ష్యం వైపు సాగాలి.

తనదు రూపమ్ము వీక్షింప తలప వలెను

వేష భాషలు మనిషికి వెలుగు నిచ్చు

అంద చందాలు మనసుకు హాయి కూర్చు

దారి చూపించు నట్టిది దార్ల మాట! (26)

మహాభారతంలో కర్ణుడు తన మిత్రుడు దుర్యోధనుడి కోసం తప్పుడు దారిలో వెళ్ళడం వల్ల పతనమయ్యాడు. కానీ అర్జునుడు లక్ష్యశుద్ధితో ఉన్నత విద్యను సాధించాడు. కళాశాల దశలో స్నేహం అనేది వ్యక్తిని నిర్మించవచ్చు లేదా పతనం చేయవచ్చు. అందుకే "చెడును వీడి మంచిని చేరవలయు" అని కవి ఇక్కడ విద్యార్థులను హెచ్చరించారు.

యవ్వనం – విశ్వవిద్యాలయ వివేకం (Higher Wisdom)

విశ్వవిద్యాలయ స్థాయికి వచ్చేసరికి కేవలం మార్కులు మాత్రమే కాదు, సమాజాన్ని మార్చే ఆలోచనలు రావాలి.

శాస్త్ర విజ్ఞాన మేదేని చాల దెపుడు

మాన వత్వపు విలువలే మనుగ డగును

లోక రీతిని జ్ఞానివై చేకొ నుమిక

దారి చూపించు నట్టిది దార్ల మాట! (27)

చారిత్రక మేధావి డా. బి.ఆర్. అంబేద్కర్ (1891–1956) ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలో చదివినా, తన జ్ఞానాన్ని సమాజంలోని అట్టడుగు వర్గాల విముక్తి కోసం వాడారు. ఉన్నత విద్య అభ్యసించే వ్యక్తి కేవలం మేధావిగానే కాదు, 'మానవత్వపు విలువలు' కలిగిన పౌరుడిగా నిలబడాలని కవి ఇక్కడ సిద్ధాంతీకరించారు.

పరిణతి – సమాజంలో ఉత్తమ పౌరుడు (The Ideal Citizen)

చివరకు అన్ని దశలు దాటిన వ్యక్తి సమాజానికి ప్రతిఫలంగా ఏమి ఇస్తున్నాడనేదే ముఖ్యం.

మేలు జేసిన వారలే మిక్కు టముగ

ధర్మ పథమున నిలుచుచు తప్పు కుండ

విశ్వ విఖ్యాతి నొందుచు వెలుగు చుండు

దారి చూపించు నట్టిది దార్ల మాట! (95)

ఇది మహాత్మా గాంధీ జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఆయన పొందిన విద్య, ఎదుర్కొన్న అనుభవాలు చివరకు ఆయనను ఒక 'మహాత్ముడిగా' సమాజానికి అర్పించాయి. "నలుగురు మెచ్చడం" అంటే వ్యక్తి సామాజిక బాధ్యతను (Social Responsibility) నెరవేర్చడమే.

ముగింపు:

సారాంశంగా చెప్పాలంటే, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి 'దార్ల మాట' శతకం కేవలం ప్రాచీన నీతులను వల్లెవేసే పుస్తకంగా చూడలేం; అది ఆధునిక మానవుడిని సంస్కరించే ఒక 'మానవీయ మ్యానిఫెస్టో'గా కనిపిస్తుంది. సాంఘికీకరణ ప్రక్రియలో కుటుంబం వేసిన సంస్కార పునాది నుండి, విశ్వవిద్యాలయం ప్రసాదించిన వివేకం వరకు, మనిషి ఎలా ఒక పరిపూర్ణ మూర్తిమత్వాన్ని (Personality) సంతరించుకోవాలో కవి దీనిలో సోదాహరణంగా వివరించారు.

పౌరాణిక గాథలను వర్తమాన సామాజిక సంక్షోభాలకు అన్వయించడం ద్వారా, ఈ శతకం పాఠకులకు, విద్యార్థులకు ఒక చారిత్రక స్పృహను, నైతిక స్థైర్యాన్ని కల్పిస్తోంది. గ్లోబలైజేషన్ ఉధృతిలో కొట్టుకుపోతున్న విలువలను కాపాడుకోవడానికి 'దార్ల మాట' ఒక ఆత్మీయమైన దిక్సూచిలా నిలుస్తుంది. విద్యార్థులు, మేధావులు, సామాన్య పాఠకులు తప్పక చదవాల్సిన ఈ శతకం, తెలుగు నీతి సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకుంటుంది. ధర్మం వైపు నడిచే ప్రతి అడుగుకూ, నిజాయితీతో కూడిన ప్రతి బ్రతుకూ 'దారి చూపించునట్టిది దార్ల మాట' అన్న మకుటం ఒక నిరంతర ప్రేరణగా ఎంతో ఔచిత్యంతో అలరారుతోంది.

***

శ్రీలనందింప నెప్పుడు చేర దీయు
విఘ్న రాజును వేడుదు విశ్వ సించి
మంచి పద్యము లనిడుదు మనసు నిలిపి
దారి చూపించు నట్టిది దార్ల మాట! (1)

శ్రీకరుండగు వేంకట శేష సాయి
భక్తిమార్గము చూపించు బహువిధముల
నేడు కొండల పైనిల్చి యేలు చుండు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (2)

కన్న తల్లిని తండ్రిని గౌర వించి
భక్తి తోడను సేవలు సలుపు వాడు
ముక్తి మార్గము నందున మునిగి యుండు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (3)

పెద్ద నాగమ్మ మాతృత్వ ప్రేమ పంచి
ఆదరమ్మును దీవెన లందజేసి
నమ్మకమ్మును నీడలో నడుపు చుండు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (4)

నాదు జనకుడు లంకయ్య నామమెపుడు
నాదరంబున నబ్బాయి యనుచు పిలిచి
దీవెనలనిచ్చు నెప్పుడు దిగులు మాన్ప
దారి చూపించు నట్టిది దార్ల మాట! (5)

శంకరయ్యను సద్భక్తి స్మరణ జేతు
ఛంద మర్మము లెరిగించి చక్క దిద్ది
పద్య విద్యను నేర్పించె పట్టు బట్టి
దారి చూపించు నట్టిది దార్ల మాట! (6)

జ్ఞాన దీపము వెలిగించి మాన సమున
అజ్ఞ మనుజుని విజ్ఞుగా నవని జేయు
గురుని కన్నను దైవము వేరె లేదు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (7)

విద్య నేర్చిన వినయంబు వెలుగు నిచ్చు
క్రమము తప్పని నడకను కలుగు నెపుడు
మంచి చెడులను దెలిపెడి మమత తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (8)

సూర్యు డుదయించుకమునుపు నార్య యనుచు
వంద నమును పంపించు గోవర్ధ నుండు
మిత్ర భావము తోడను మేలు గూర్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (9)

ఆప్త మిత్రులై నిలిచిరి యను దినమ్ము
వారు చలపతి రావును పార్వ తీశ
శర్మ గారల నెప్పుడు సంస్తు తింతు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (10)

వంశ గౌరవ మన్నది వాక్కు తోడ
సత్య మెప్పుడు వీడక సాగ వలెను
మాట తప్పని వానికి మన్న నబ్బు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (11)

సరిగ నవమాసములుమోసి మురిపమంది
పేగు బంధాన్ని తృప్తిగా పెంపు జేసి
తల్లి తండ్రిని వీడుట తగదు తగదు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (12)

ఎరుక తోడను నెప్పుడు నింపు మీర
శ్రేష్ఠ కీర్తిని లోకాన స్థిరము పరచి
మదిని మేల్కొల్పు మేధయే ముదము కూర్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (13)

తండ్రి వలెనన్న సాకిన త్యాగ శీలి
అండ దండగా నిలిచెమా యన్న చూపె
అడుగు జాడలన్ విడువక నడుచుకొనెద
దారి చూపించు నట్టిది దార్ల మాట! (14)

కష్ట కాలాన తోడుగా కలిసి మెలిసి
మెలగు చున్నను తప్పక మేలు కలుగు
అన్న దమ్ముల బంధమ్ము హాయి కూర్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (15)

మాతృ మూర్తిగా నిరతము మమత పంచు
ఆడు బిడ్డల దీవెన లందు కొనిన
వెన్ను దన్నుగా నుండును వృద్ధి యందు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (16)

కష్ట సుఖములన్ కనిపెట్టి యిష్ట ముగను
సుఖము సంతోష ములతోడ శుభము కూర్చు
అతివ యర్ధాంగి నెప్పుడు నాద రించు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (17)

పేగు బంధాల నెప్పుడు ప్రేమ పంచి
సరిగ క్రమశిక్షణనునేర్పి సంస్క రింప
నిలిచి యుందురు నీతితో నిక్క మిదియె
దారి చూపించు నట్టిది దార్ల మాట! (18)

కలిసి మెలసి జీవించిన కలదు సుఖము
ఒంట రిగనున్న తప్పదు కంట నీరు
ఐక మత్యమే కొండంత నండ నిచ్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (19)

నమ్మ కముతోడ నిత్యము నడువ వలెను
మోస పుచ్చిన జనులెల్ల మూర్ఖు డనుచు
ముద్ర వేయుట తప్పదు ముఖము ముందు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (20)

ప్రేమ పంచిన తప్పక ప్రేమనొందు
శాంతి మార్గము వీడక సాగవలయు
ధర్మ నిరతియే రక్షించు ధరణి నెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (21)

ఆప దెదురైన వెంటనే యాదు కొనెడి
మిత్ర వర్యుల హృదయాన నిల్చి మెలగు
అంత రంగము నందున నద్ద ముగను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (22)

సత్య వాక్కును మరువడు సజ్జ నుండు
న్యాయ మార్గమే జీవిత ధ్యేయ మగును
ధర్మ మేగెల్చి నిలబడు ధరణి యందు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (23)

గురువు నేర్పిన విద్యను మరువ కెపుడు
జ్ఞాన దీపము వెలిగించు నవని యందు
నిత్య విద్యార్జ నపరుడు నిశ్చ యముగ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (24)

పాఠ శాలలు చూపించు బ్రతుకు బాట
మస్తకమును పెంపొందించు పుస్త కములు
వినయ విధేయత లున్న విజ్ఞు డతడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (25)

తనదు రూపమ్ము వీక్షింప తలప వలెను
వేష భాషలు మనిషికి వెలుగు నిచ్చు
అంద చందాలు మనసుకు హాయి కూర్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (26)

శాస్త్ర విజ్ఞాన మేదేని చాల దెపుడు
మాన వత్వపు విలువలే మనుగ డగును
లోక రీతిని జ్ఞానివై చేకొ నుమిక
దారి చూపించు నట్టిది దార్ల మాట! (27)

సజ్జ నుండు తా మెల్గును సత్స భలను
నెపము లనునెంచు చుండును నీచ బుద్ధి
కాల గర్భాన కలియును కపటు డెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (28)

చలువ నిచ్చును గాదె వృక్షమ్ము లెపుడు
ప్రాణ వాయువు నందించి బ్రతుక జేయు
చెట్లు నరికిన ప్రాణికి చేటు కలుగు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (29)

కలుష మైపోయె నీనాడు గాలి నీరు
ప్రకృతి రక్షణ కోరుచు పాటు పడిన
ఆయురారోగ్య మందించు నవని కెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (30)

పచ్చ నైనట్టి చెట్లని ప్రస్తు తింప
ఘనము గాపెంచు జీవిత కాల మిలను
వృద్ధి నొందించు వనములన్ బుద్ధి గాను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (31)

నీరు లేనిది నిఖిలము నిలువ బోదు
వంద నమ్ముగ మేఘము లంద జేసె
చినుకు చినుకును దాచాలి చిత్త గించి
దారి చూపించు నట్టిది దార్ల మాట! (32)

వృక్ష సంపద నెలకొన్న విరివి గాను
కురియు చుండును వర్షాలు కొరత లేక
నరుడు నమ్మాలి ప్రకృతిని మరువ కెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (33)

వ్యర్థ మైనట్టి ప్లాస్టిక్కు వాడు చున్న
ముప్పు వాటిల్లు చుండును తప్ప కుండ
ప్రగతి శూన్యమ్ము గామారు ప్రాణుల కిక
దారి చూపించు నట్టిది దార్ల మాట! (34)

పక్షి జాతులు పృథివిని పదిల పరచు
మృగము లున్నచో నడవికి మేలు కూర్చు
జీవ వైవిధ్య మెంతేని శ్రేష్ఠ తనిడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (35)

ఆశ చిగురించు ననుకాని యవని యందు
సృష్టి ధర్మము ప్రేమతో వృద్ధి నొందు
ప్రకృతి హితమును కోరినన్ ప్రగతి కలుగు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (36)

ధనుజ రూపులు ద్రవ్యమున్ దండు కొనగ
కల్మ షంబులు నిరతము కలుపు చుండ
నేటి సెలయేరు లన్నియు కన్నీరు నిలిచె
దారి చూపించు నట్టిది దార్ల మాట! (37)

ఊట బావినీరందించు నొసర శక్తి
మురుగు కాల్వల వలననే ముప్పు కలుగు
తేడ నెరుగక గైకొన్న తాడ తీయు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (38)

ఊరు చెరువులన్ కాపాడి యొనరు గాను
శుద్ధి చేసిన తప్పక శుభము కలుగు
జీవ రాశిని రక్షించు చింత బాపు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (39)

కల్మ షపుగాలి పీల్చిన కాటి కంపు
సహజ వాయువు జీవికి స్వస్థ తనిడి
నిండు నూరేళ్ళ రక్షించు నెమ్మ దిగను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (40)

వృక్ష సంపద తొలగిన వేగ ముగను
ఉద్భవించును వేడియు నుగ్ర ముగను
ప్రాణ వాయువు నందక ప్రాణులెల్ల
అలమ టించును చూడుము దార్ల మాట! (41)

పొగలు క్రమ్ముచు నుండగా ముప్పు పొంచు
రోగ బాధలు కాటికి సాగ నంపు
శుద్ధ వాయువు లందించు శుభము నెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (42)

బోరు బావులు త్రవ్విన బుడమి క్రుంగు
ప్రళయ ములుపొంచి యుండును ప్రజల చెంత
కొట్టు మిట్టాడు చుండును కుమిలి కుమిలి
దారి చూపించు నట్టిది దార్ల మాట! (43)

మట్టి ముద్దల గోడలే మనిషి కెపుడు
కాల మునుబట్టి తగినట్లు కాచు చుండు
రాతి కట్టడ మందున రక్ష ణేది?
దారి చూపించు నట్టిది దార్ల మాట! (44)

పంట దిగుబడి కొరకయి ప్రాకు లాడి
విషపు గుళికలు వెదజల్లి విచ్చ లవిడి
సహజ మెరువులన్ వీడుట చావు కొరకె
దారి చూపించు నట్టిది దార్ల మాట! (45)

సూర్య చంద్రులు భాసిల్లి శుభము కూర్చి
నింగి నేలలన్ జీవులు నిర్భ యముగ
బ్రతుకు నందించు చున్నవి ప్రతి దినమ్ము
దారి చూపించు నట్టిది దార్ల మాట! (46)

వనము లెండిన వర్షాలు వసుధ యందు
కోర్కె మీరగ తృప్తిగా కురువ బోవు
ధర్మ హీనతన్ పెరుగు నధర్మ మెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (47)

విషము చల్లిన విత్తనమ్ విలయ మగును
నేల కలుషిత మ్మొనరింప నేర మగును
శుద్ధ మృత్తిక నిత్యమ్ము శుభము నిచ్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (48)

భాను చంద్రులు భాసిల్ల భవ్య రీతి
నింగి నేలలన్ స్వచ్ఛంగ నిలుప వలెను
విశ్వ రక్షణ విజ్ఞాని విధియె యనగ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (49)

వర్ష మాగిన వృక్షాలు వాడి పోవు
మించి కురిసిన నష్టమే మిగులు నెపుడు
ధర్మ నిరతిని తప్పిన ధన్య మగునె?
దారి చూపించు నట్టిది దార్ల మాట! (50)

నరుడు జేసెడి నేరము నష్ట మిచ్చు
వృక్ష ములనేల కూల్చిన వృద్ధి యగునె?
ప్రకృతి కోపము ప్రాణికి ప్రళయ మగును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (51)

ఆశ పెరిగిన ధర్మమ్ము నడుగు నంటు
నొక్క పాదము నిలిచింది యోపిక గను
సత్య మార్గమ్ము వీడక సాగ వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (52)

చెట్లు నరికిన ప్రకృతికి చేటు కలుగు
పచ్చ దనమేను పృథివిని పదిల పరచు
ప్రాణ వాయువు నందించు ప్రాణి కెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (53)

మంట లోపల దాగియున్నట్టి శక్తి
ఆశ పెరిగిన నగ్నియు అదుపు తప్పు
శక్తి పొదుపున శాంతియు సరిగ తూగు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (54)

నింగి నేలలు నిత్యము నిర్మ లముగ
పంచ భూతాల నందించు బ్రతుకు కొరకు
కలుష జేయుచు నున్నచో కాచు కొనుము
దారి చూపించు నట్టిది దార్ల మాట! (55)

మంట లోదాగి నటువంటి మహిమ నెరుగు
చిచ్చు పెట్టిన జగతిని చీల్చి వేయు
ఆద రించిన వారికి అండ నిలుచు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (56)

చినుకు లన్నియు కలిసిన సింధు వగును
పైస పైసను కూర్చిన బాధ్యత గను
అప్పు లెరుగక శాశ్వతా నంద మొసగు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (57)

జీవు లత్యాశ పరులైన చేటు కలుగు
అక్ర మార్జన కొరకయి అడుగు లిడక
నున్న దానితో సంతృప్తి నొంద వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (58)

కష్ట పడకున్న ఫలితము కలుగ దెపుడు
తప్ప కుండగ సోమరి తనము వీడి
కంక ణముదాల్చి ముందుకు కదల వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (59)

దీప మందించు కాంతి దేదీప్య ముగను
దారి చూపించు చున్నది తీరు గాను
నలుగు రైనను మెచ్చక నడుచు టేల?
దారి చూపించు నట్టిది దార్ల మాట! (60)

విక్రయించాలి సరుకులన్ సక్రమముగ
కల్తి మయమైన ప్రాణిని కాటి కంపే
వర్త కులకంద జేతును వంద నములు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (61)

అప్పు ముప్పని యెరిగించి రార్యు లెల్ల
తిప్ప లనుపెట్టు చుండును తీర్చ కున్న
ఉన్న దానితో జీవించు నొనరు గాను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (62)

లోకు లకుపంచవలయును శ్రీక రముల
విలువ లనుపెంచి పోషించి వెలుగ జేయు
మేలి గుణములే మనిషికి మేలు కూర్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (63)

కాల చక్రమ్ము నిరతము కదలు చుండు
విజయ మార్గము నేనాడు వీడ కుండు
శ్రద్ధ తోడను కృత్యాలు సలుప వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (64)

నిప్పు నంటిన కాలదా యెప్పు డైన?
ముందు జాగ్రత్త గానున్న ముదము కలుగు
అనుభ వమునేర్పి నడిపించు హాయి కూర్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (65)

దాన గుణశీలు రేనాడు దాచు కొనరు
పంచి పెట్టరె నిరుపేద ప్రజల కెపుడు
ఇవ్వ బూనని లోభివా డెప్పు డైన?
దారి చూపించు నట్టిది దార్ల మాట! (66)

ఓర్పు విడనాడ కేదేని నేర్వ వలెను
సరిగ నైపుణ్య మబ్బిన సఫలు డగును
శ్రమయు జెందక నిసుమంత సాధ్య మగునె?
దారి చూపించు నట్టిది దార్ల మాట! (67)

శాయ శక్తుల సమకూర్చి శ్రమను జెంది
దాచి పెట్టిన ధనమును దగిన రీతి
ఖర్చు పెట్టుచు నున్నచో గౌర వమగు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (68)

సమయ పాలన పాటించి శ్రద్ధ తోడ
విధిగ నిర్వ హించగ వలె విధుల నెపుడు
కాల మునువృథా సేయుట కీడు దెచ్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (69)

అవస రాలకు నప్పుకై యడుగు లిడుచు
వడ్డి వ్యాపారు లల్లేడి వలల చిక్కి
తిరిగి చెల్లింప లేకున్న తిప్ప లగును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (70)

విశ్వ మంతయు ఒక్కటై వెలుగు చుండు
సరిగ సత్సంగ మైయున్న సంబ రమ్ము
కోర వలయును తప్పక లోక హితము
దారి చూపించు నట్టిది దార్ల మాట! (71)

లాభ మునుకోరు వ్యాపారి లక్ష్య మదియె
మోస మెరుగక జేయుట ముచ్చ టగును
న్యాయ మార్గము విడువక నడవ వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (72)

సరుకు నాణ్యత లేకున్న సజ్జ నుండు
కనుల జూచుట కైనను కదల డిటకు
నీర సించును వ్యాపారి నిక్క మిదియె
దారి చూపించు నట్టిది దార్ల మాట! (73)

సహక రింపుతో సాగిన సకల జనులు
ఖండ ఖండాంత రములలో ఖ్యాతి గాంత్రు
సుఖము సంతోష ములతోడ శుభము కలుగు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (74)

విత్త మార్జన కొరకయి విబుధ వరులు
సత్య న్యాయాల మార్గము సమ్మ తించి
ఆచ రించెద రత్యంత మాద రమున
దారి చూపించు నట్టిది దార్ల మాట!(75)

ప్రగతి బాటను పట్టిన ప్రజలు నెల్ల
గ్రామ సీమలు వెలుగొందు గౌర వముగ
అప్పు డధికార గణమెల్ల నాద రించు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (76)

నీతి యవనీతి నణచుచు నిలువ వలెను
నమ్మ కమ్మను కొమ్మను నరుక వలదు
సద్గు ణమ్ములే జన్మకు సార్థ కమ్ము
దారి చూపించు నట్టిది దార్ల మాట! (77)

తార తమ్యము చూపక పౌర జనుల
నేలు చున్నను ఏలికల్ మేలు కలిగి
సరిగ సమరస భావన సంత రించు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (78)

తప్పు లొప్పుల నెల్లను తప్ప కుండ
తరచి చూడాలి ఏలికల్ మరువ కెపుడు
తగిన రీతిగా లోకాన ప్రగతి కలుగు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (79)

కులము మతభేద ములపేర కుటిల మెపుడు
నెంచ వలదయ్య ప్రజలలో నెవ్వ రైన
లోక హితమును కోరాలి ప్రాక టముగ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (80)

ప్రతిభ పాటవమ్ములు దాగి ప్రాకటముగ
అలుపు నెరుగక యత్నింప నవని వెలుగు
సాధనము తోడ కార్యముల్ సఫల మగును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (81)

అధిక భారము మోపక అడుగు డడుగున
అండ దండల నందించు ఆద రమున
ధాన్య రాసుల నందించు ధరణి యెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (82)

మధువు గ్రోలిన మధుపము మాన వులకు
మేలు చేకూర్చు విధముగ ఏలి కలును
ప్రజల కందించ వలెపరి పాల నమును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (82)

ముందు చూపున్న నేతలు ముదము తోడ
వ్యర్థ ములనెల్ల దూరము పార ద్రోలి
మేలు చేకూర్చ వలయును మేటి గాను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (84)

రాజ మార్గము వీడక రాత్రి పగలు
ప్రజల సంక్షేమ మునుకోరి పంచు కొరకు
కూర్చ వలయు ఖజానాను కోర్కె మీర
దారి చూపించు నట్టిది దార్ల మాట! (85)

అక్ష రాభ్యాస మందించు నమృత మిలనూ
శాశ్వ తమ్ముగ జీవిక సఫల మగును
అర్థ మెంతేని కూర్చిన వ్యర్థ మగును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (86)

గురువు నేర్పిన విద్యను మరువ కెపుడు
స్మరణ జేసిన వారికి జయము కలుగు
విశ్వ విఖ్యాతి నొందుచు వెలుగు చుండు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (87)

మాతృ భాషయే నిరతము మమత పంచు
అమృత తుల్యమై నిక్కమ్ము నాద రించు
అమ్మ యనుమాట చెవులకు కమ్మ నగును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (88)

తప్ప కుండగ సోమరి తనము వీడి
చేయ వలయును పనులన్ని శీఘ్ర గతిని
స్వస్తి పలకాలి వాయిదా సకల జనులు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (89)

మాటి మాటికి చెప్పుడు మాట వినిన
చేటు చేకూర్చి మనసున చింత పెరిగి
సాగ కుండును మనుగడ సంత సమున
దారి చూపించు నట్టిది దార్ల మాట! (90)

బ్రతికి యున్నంత కాలమ బద్ధ మాడి
ఏమి సాధించ లేవునీ వెచట నైన
నిజము వెలుగొందు చుండును నిక్క మిదియె
దారి చూపించు నట్టిది దార్ల మాట! (91)

దేశ భక్తిని చాటుము దెసల దాక
కీర్తి కాంతయే నినుచేరి కేలు మోడ్చు
మమత ననురాగ ములుపంచి మసలు కొనుము
దారి చూపించు నట్టిది దార్ల మాట! (92)

సేవ లందున మానవ సేవ జేయ
జన్మ సాఫల్య మొనగూడు శాశ్వ తముగ
విజ్ఞు లగువార లీవిధి వీడ రాదు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (93)

సహజ గుణశీల వంతుడు సంత సమున
దాన ధర్మాల నొనరించు ధైర్య ముగను
పర హితమ్మును కోరును ప్రతి దినమ్ము
దారి చూపించు నట్టిది దార్ల మాట! (94)

మేలు జేసిన వారలే మిక్కు టముగ
ధర్మ పథమున నిలుచుచు తప్ప కుండ
విశ్వ విఖ్యాతి నొందుచు వెలుగు చుండు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (95)

నీతినియమాలు హృదయాన నిలుపు కొనుచు
బ్రతుకు బండిని లాగాలి భారమనక
కష్టనష్టాలునన్నియు కనులు జూడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (96)

శీల వంతుడు సంఘాన శ్రీక రమగు
నిత్య నూతన కృత్యాల నెరపు చుండు
వృత్తి ధర్మమ్ము మదినిల్పి వీడ డెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (97)

మిత్ర భావము నిరతము మేలు కూర్చు
శాంతి సౌఖ్యము నందించు సజ్జ నాళి
దుష్ట బుద్ధిని అడవిలో త్రోసి వేయు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (98)

కష్ట సుఖముల నన్నిటిన్ కలిసి మెలిసి
పాలు పంచుకొ నుచునున్న బలము పెరుగు
భేద భావమ్ము వీడిన ప్రేమ నిలుచు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (99)

దీన జనులను దరిచేర్చి తృప్తి కూర్చు
పర హితమ్మును కోరిన ప్రాక టముగ
త్యాగ శీలమ్ము నీదని తలచు దురయ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (100)

అమ్మ భాషయ మృతమయ్యి యవని యందు
అమర పదమున నిలుపుతా నాద రమున
జాతి గౌరవ చిహ్నమై జయము కలుగు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (101)

అమల గురుమూర్తి కెప్పుడు నంజ లిడగ
అమరి విద్యాది వినయముల్ క్రమము గాను
విశ్వ విఖ్యాతి నొందించి వెలుగ జేయు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (102)

సత్య వాక్పరి పాలనే సకల జనుల
హృద యమునుచూర గొనజేసి ముదము కూర్చు
ధర్మ మార్గాన్ని నడిపించు తప్ప కుండ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (103)

కాల చక్రమ్మె దైవమై కరుణ తోడ
కార్య సిద్ధిని కలిగింప కదల జేయు
వీడ సోమరి తనమును వెన్ను తట్టు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (104)

అప్పు లేకున్న మనిషికి హాయి కలుగు
తప్పు జేయక నడిచిన మెప్పు నొందు
పూర్తి చాడీలు వినకున్న పూజ్యు డగును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (105)

విద్య పెంపొంద జేయును విలువ నెపుడు
దాచ నటువంటి విలువైన ధనము గాను
ఆద రముతోడ విజ్ఞాని నాదు కొనును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (106)

నోరు మంచిది యైనచో నూరి యందు
శాంతి సౌఖ్యము లనుపొంది సాగు చుండు
సరిగ మమతాను రాగాలు సంత రించు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (107)

గర్వ పోతులు గన్నులు గాన రెపుడు
విర్ర వీగుచు నుందురు వెర్రి గాను
చక్క దిద్దగ బ్రహ్మకు సాధ్య మగునె?
దారి చూపించు నట్టిది దార్ల మాట! (108)

కష్ట నష్టాలు నెదురైన నిష్ట ముగను
కృత్య ములనెల్ల సాగించి తృప్తి గాను
పూర్తి సత్ఫలి తాలను పొందు చుండు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (109)

కనక హారమ్ము లొసగవు గౌర వమును
సత్య భాషణ మ్మేనిల్పి సకల జనుల
గౌర వమ్మును పొందును ఘనము గాను
దారి చూపించు నట్టిది దార్ల మాట!(110)

ఆప దలయందు తప్పక నండ నిలిచి
తోడు నీడగా నిలవాలి దూర మవక
స్నేహ శీలియై మెలగాలి చివరి వరకు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (111)

కూర్మి లేనట్టి దొరలను కొలువ తగదు
శక్తి యుక్తుల తోడను సమర మందు
కూల్చి వేయాలి కుట్రల కుటిల మతుల
దారి చూపించు నట్టిది దార్ల మాట! (112)

దేవ దేవుని పైమన దృష్టి నిలిపి
భక్తి భావమున్ వీడక ప్రస్తు తింప
అండ దండల నందించి యభయ మొసగు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (113)

దైవ నామమ్ము నిలిపుచు తలపు నందు
సరిగ కృషిసల్పు చున్నను సత్ఫ లితము
పొంద జేయగ నరుదెంచి ముందు నిలుచు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (114)

శతక పద్యాలు చదివిన సంత సమున
నిలుపు నైతిక విలువలు నేర్పు చుండు
సద్గు ణమ్ముల నెన్నియో సమర కూర్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (115)

బలము నందించు బద్దెన పద్య మలిక
సుమతి శతకమ్ము సూక్తులు శుభము కూర్చు
భవ్య గుణముల నొసగు సుభాషి తములు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (116)

పాత పద్యాలు చదువగా పరవ శమున
అనుభ వజ్ఞుల సూచన లందు కొనిన
ధర్మ మార్గాన జీవికల్ ధన్య మగును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (117)

శీల మున్నట్టి కవికృతుల్ చిత్త మందు
నిలిపి పఠియించి విలువలన్ నేర్చు కొనుచు
వ్యాప్తి చేయాలి భువిపై వంద నముగ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (118)

శాశ్వ తమ్మైన కాయమ్ము సకల జగతి?
నీటి బుడగయ్యె ప్రాణము నిలువ బోదు
ఏది శాశ్వత మవనిలో నెరుగ వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (119)

అంత మెరుగమీ కోర్కెల నవని యందు
తీర దీదాహ మేనాడు తృప్తి గాను
ఆశ వీడిన నొనగూరు హాయి మనకు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (120)

తీర నెన్నియో కోర్కెల తృప్తి లేక
వ్యాధి గ్రస్తులై వృద్ధాప్య వలయ మందు
చీకు చింతల తోనిండి చిక్కు కొనరె?
దారి చూపించు నట్టిది దార్ల మాట! (121)

కత్తి పట్టక శాంతికై కలయ జూచి
మౌన వ్రతమున సాధించి మాన వాళి
కంద జేసెను బుద్ధుడు నంద ముగను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (122)

కులము మతభేద ములనెల్ల కూల్చి వేసి
మనిషి మనిషిగా బ్రతికిన మనుగ డౌను
సమత మమతలు పంచెడి సత్య మిదియె
దారి చూపించు నట్టిది దార్ల మాట! (123)

మూఢ విశ్వాస మునువీడి ముదము తోడ
ప్రతిభ పాటవ ములుకల్గి బ్రతుక వలెను
సత్య మార్గమ్ము గుర్తించి సాగ వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (124)

జీవ కారుణ్య భావము చిగురు వేయ
కరుణ గుండెలో నిరతము కదలు చుండ
లోక కల్యాణ ముకొరకు ప్రాకు లాడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (125)

మాన్యు డైనట్టి బుద్ధుని మార్గ మైన
ధర్మ పథమును వీడక తరలు చున్న
సమత మమతలు తప్పక సాధ్య మగును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (126)

సరిగ సంకల్ప శుద్ధితో సాగు చున్న
చూడ్కు లందున మరియు వాక్శుద్ధి కలిగి
పలుకు చున్నట్టి పలుకులే ఫలిత మిచ్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (127)

చూపు తోపాటు వాక్కును శుద్ధి నడత
బ్రతుకు శ్రమయును స్మృతియును భౌమ ధ్యాన
మొప్పు నష్టాంగ మార్గమం దొదిగి యుండు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (128)

చూపు సత్యమై యున్నను శుభము కలుగు
సృష్టి ధర్మమ్ము నెరిగిన చింత తొలగు
భ్రాంతి వీడిన జ్ఞానము భవ్య మగును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (129)

మంచి భావాలు మనసున మసలు చుండ
కామ క్రోధాదు లన్నిటన్ కదల జేసి
శాంతి నొనగూర్చు హృదయాన సంత తముగ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (130)

కల్ల కపటమ్ము లెరుగక నుల్ల మందు
పలుకు లందున తేనియ లొలుకు చుండ
అమృత తుల్యమై హృదయాల హాయి కూర్చు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (131)

నీతి నియమాలు హృదయాన నిలుపు కొనుచు
బ్రతుకు బండిని లాగాలి భార మనక
కష్ట నష్టాల నన్నియు కనుల జూడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (132)

గడచి పోయిన కాలము మరలి రాదు
నేటి పనులను రేపని నెట్ట కుండ
నియతి తోడను సాగిన జయము కలుగు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (133)

గడచి పోయిన కాలము మరలి రాదు
గడియ గడియయు విలువైన కానుకౌను
కార్య ములజేయ నలసత్వ మవని తగదు
దారి చూపించు నట్టిది దార్ల మాట! 134)

కాల మెరిగి పనులనెల్ల కలిమి తోడ
సమయ పాలన నిత్యము సలుప వలెను
నిలుక డగ నుండు కార్యముల్ నిఖల మందు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (135)

రేపు చేయు పనులనెల్ల నేడె చేయు
నేడు చేయగ నిప్పుడె నిక్కముగను
కాల హరణము జేయక గడప వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (136)

పగలు రేయిని చూడక పాటు పడగ
విజయ లక్ష్మియు వరియించు నిక్కముగను
సోమ రితనము దరిజేర జూడ దగదు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (137)

కాల మెప్పుడు నాగును కాంచ వలయు
పసిడి కన్నను విలువైన బాట యిదియు
నిమిష మేనియు వృథ చేయ నిఖల మందు
దారి చూపించు నట్టిది దార్ల మాట! 138)

మద్య పానము సేవించి మరులు చెంది
బండి నడుపగ ముప్పౌను పార చూడ
ఇంటి వారు నీ కోసము నిలుతు రెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (139)

తలను గాచును కవచమ్ము తలను దాల్చ
బండి నడుపగ క్షేమమ్ము పార చూడ
ప్రాణ రక్షణ ముఖ్యంబు ప్రగతి కరయ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (140)

మత్తు లోనను బండిని మరులు చెంది
నడప జూచిన ప్రాణముల్ నష్ట మౌను
మంచి బుద్ధితో క్షేమము పొందు మెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (141)

ఎర్ర దీపము జూపిన నెదురు నిలవ
పచ్చ దీపము వేయగ పయన మవను
క్రమము తప్పని పద్ధతి కలుగు నెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (142)

దాచు సంఖ్యల నెవరికి దెలుప వద్దు
బ్యాంకు వివరము లడుగరు భరవ సమున
మరపు లేకను జాగ్రత్త మనుగ డందు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (143)

బహుమ తనియెడి యాశతో బరులు పిలువ
మురిసి వెళ్ళిన దగులును ముప్పు నెపుడు
తెలివి గలిగిన క్షేమము దెలియ వలయు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (144)

నకిలి పేర్లతొ ఫోనులో నటన జేసి
కపట ప్రేమతో దోచెడి కష్టు లుందు
నమ్మి చిక్కక జాగ్రత్త నడచు నెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (145)

కష్ట మెరుగని ధనమును గాంచ వద్దు
వలపు వలలని నమ్మిన వంత కలుగు
తెలివి తోడను మెలగుట దివ్య మౌను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (146)

చేతి లోనున్న ఫోనుతో చెడును తెచ్చు
చెంత చేరిన చుట్టముల్ దూర మౌదురు
కాల మంతయు వ్యర్థమై కలుగు కీడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (147)

కంటి చూపును చెరిపియు కలుగు నొప్పి
నిదుర రాకను దేహము నిరత మలయు
రోగ పీడిత మౌనుగా రోత ఫోను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (148)

చదువు సంధ్యల యందున శ్రద్ధ తగ్గ
మనసు నిలువదు నెప్పుడు మాయ ఫోను
జ్ఞాన శూన్యుగ జేయును గర్వ మడచి
దారి చూపించు నట్టిది దార్ల మాట! (149)

ఆట పాటలు మరచిరి యర్భ కులును
చిన్న తనమున కళ్ళకు చిక్కు ఫోను
బద్ధ కమ్మును పెంచును బాధ లిడును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (150)

ఇరుగు పొరుగుల వారితో నింపు మీర
కలిసి మెలిసియు నుండగా కలుగు మేలు
కష్ట కాలాన వారేను కవచ మగుచు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (151)

పరుల సుఖమును గోరుట పరమ పదము
పొరుగు వారల ప్రేమింప పుణ్య మబ్బు
మంచి మనసున వెలుగుము మహిని నెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (152)

ఎవరు వచ్చిన నెరుగని వారికైన
ఆశ్ర యమ్మును నొసగుట యార్య గుణము
పుణ్య గతులెల్ల నందించు భూమి యందు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (153)

చుట్ట ములు వచ్చి నప్పుడు చోద్య ముగను
అరవ రాదును నిల్వక యవని యందు
పరుల ఇబ్బంది పెట్టక బ్రతుక వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (154)

రంజ నంబుల టీవిని రవము పెంచి
పొరుగు వారల నెప్పుడు పీడ సేయ
మంచి నడకయే మనకును మాన మౌను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (155)

చుట్ట ములు వచ్చి నప్పుడు చోద్య ముగను
అరవ రాదును నిల్వక యవని యందు
పరుల నిబ్బంది పెట్టక బ్రతుక వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (156)

గాలి నిచ్చెడి చెట్లను గౌర వింప
నీరు నిచ్చెడి నదులను నిలువ జేయ
తల్లి ధరణిని మొక్కుట తగును మనకు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (157)

మేలు జేసిన వారిని మెలకువగను
మరవ రాదును ఎన్నడు మహిని యందు
దీవె నలు పొందు మెప్పుడు దివ్య ముగను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (158)

తనువు శాశ్వత మౌనయా ధరణి యందు?
పరుల కైపడు శ్రమయెగా నిలచు నెపుడు
మంచి పనులను జేయుటే మనిషి విధియు
దారి చూపించు నట్టిది దార్ల మాట! (159)

మూడు రంగుల జెండాను ముదము తోడ
గౌర వింపుచు నెప్పుడు గాంచ వలెను
భక్తి తోడను మ్రొక్కుము భరత మాత
దారి చూపించు నట్టిది దార్ల మాట! (160)

జాతి స్వేచ్ఛను కోరుచు జగతి పైన
ప్రాణ మర్పణ జేసిన భక్తు లనుచు
గుర్తు జేసుకోవలయును కొలువు మీర
దారి చూపించు నట్టిది దార్ల మాట! (161)

తల్లి కంటెను మిన్నయౌ ధరణి మాత
స్వర్గ మన్నది యిక్కడె సాధ్య మౌను
భక్తి తోడను కొలువుము భరత భూమి
దారి చూపించు నట్టిది దార్ల మాట! 162)

భరత మాతకు నర్పిత భావ మమర
పఠన జేసిన వారికి భాగ్య మబ్బు
ముక్తి నిచ్చును నెప్పుడు ముదము తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట! (163)

తల్లి వోలెను దీవించి తప్పు దిద్దు
తండ్రి వోలెను నిలుచును ధైర్య మొసగి
సఖిగ నుండును సర్వదా సాయ పడుచు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (164)

ఇల్లు నందన వనమౌను ఇంతి తోడ
భర్త కోపము చల్లార్చు భావ మలరి
ఇల్లె వైకుంఠ మగునుగా ఇంతి యున్న
దారి చూపించు నట్టిది దార్ల మాట(165)

కోప మెంతగ వచ్చిన నోర్చి పతిని
శాంతి పథమున నడిపించు సాధ్వి తానె
కులము గౌరవ మెప్పుడు నిలుపు నింతి
దారి చూపించు నట్టిది దార్ల మాట. (166)

ఆకలైనను తను తిన్న దనుచు తలచి
పతికి వడ్డించు ప్రేమతో భక్తి గూడి
అమృత తుల్యమై తోచును ఆపె చేతి
దారి చూపించు నట్టిది దార్ల మాట. (167)

ఇంతి ఇల్లాలు అగుచును ఇల్లు దిద్దు
పరుల కష్టము కనుగొని జాలి జూపి
అండ నిలుచును నార్తుల కండ గనగ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (168)

నవ్వు గద యిల నరులకు నయము గనగ
ఓర్పు నేర్పుల నిలుపును ఓలి మియును
భార్యయే గదా భాగ్యంబు పతికి నిలను
దారి చూపించు నట్టిది దార్ల మాట. (169)

గడ్డ పూజ్యమ్ము గాదె యీ ధరణి పైన
జన్మ భూమిని ప్రేమతో చాట వలెను
మాతృ దేశము మరువని మహిత గుణము
దారి చూపించు నట్టిది దార్ల మాట. (170)

ఎదుటి వారల తప్పులు ఎన్న దగదు
తనదు తప్పును తానును తలప వలెను
చెడ్డ గుణమును వీడిన చిత్ర మగును
దారి చూపించు నట్టిది దార్ల మాట.(171)

తేనె కన్నను తీయని తెలుగు భాష
అమ్మ నేర్పిన పలుకులు ఆద రించు
జాతి గౌరవ మదియెగా జగతి పైన
దారి చూపించు నట్టిది దార్ల మాట. (172)

తల్లి దండ్రుల సేవయె తరగ నట్టి
భాగ్య మొసగును భువిలోన భవ్య ముగను
దైవ మగుదురు వారలే ధరను జూడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (173)

చిన్న సాయము చేసిన చింత తీరు
నలుగు రందరి మేలును నమ్మ వలెను
త్యాగ గుణమున వెలుగుము ధరణి లోన
దారి చూపించు నట్టిది దార్ల మాట. (174)

తోడ పుట్టిన సోదరి తోడు నీడ
కన్న తల్లిగ మారును కష్ట మందు
ప్రేమ పంచెడి దేవత పృథివి పైన
దారి చూపించు నట్టిది దార్ల మాట. (175)

పండ్లు పండిన చెట్టును వంగు నట్లు
విద్య నేర్చిన వాడును వినయ మందు
గర్వ మణచిన కీర్తియు కలుగు నపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట(176)

కోయి లమ్మను మెచ్చును కోటి జనులు
కాకి కూతను వినగను కష్ట మగును
తీపి మాటల పలుకుము ధీర గుణము
దారి చూపించు నట్టిది దార్ల మాట. (177)

పాము కీడును పాలును పొర బోయ
విషము హెచ్చును గానియు వేరు గాదు
దుష్ట బుద్ధిని వీడదు దుర్ల భముగ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (178)

పండ్లు పండిన చెట్టును వంగు నట్లు
విద్య నేర్చిన వాడును వినయ మందు
గర్వ మణచిన కీర్తియు కలుగు నపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (179)

పారి పోయెడి నదియును పరుగు లాడ
తిరిగి రాదుగ నెప్పుడు తెలివి తోడ
కాల మంతయు వృథయైన కలుగ దేమి
దారి చూపించు నట్టిది దార్ల మాట. (180)

ఎంత తవ్విన నవనియు నెగ్గు దలచ
ఓర్పు తోడను ఫలితము నొసగు చుండు
కష్ట మందున సహనమే కవచ మగును
దారి చూపించు నట్టిది దార్ల మాట. (181)

వెండి కంచము వెలుగును వెలయు చుండ
మట్టి కుండకు దక్కదు మహిమ యెప్పుడు
అల్ప బుద్ధికి గలుగదు నార్య పదవి
దారి చూపించు నట్టిది దార్ల మాట. (182)

పూల నమ్మిన చోటను పొందు నట్లు
మంచి వారల తోడను మలయు చున్న
గౌర వంబును పెంచును గరిమ తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (183)

పుడమి లోపల నెక్కడ పుట్టి నట్టి
పుత్త డినిజూడ నెల్లరు పూజ సేయ
మంచి గుణమున వెలుగుము మహిమ తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (184)

చీమ నెప్పుడు జూడుము చింత లేక
కష్ట పడుచును గూడెడి కణము లట్లు
సాధ నమునను గెలువుము సఫల మగుచు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (185)

నీరు చేరును తామర నిలక డగను
అంట కుండను నుండును నలఘు రీతి
లోక మందున మెలగుము లోభ మెంత
దారి చూపించు నట్టిది దార్ల మాట. (186)

మేఘ మెప్పుడు కురియును మేలు కొరకు
పంట పొలముల నిలుపును పదిల ముగను
త్యాగ గుణమున వెలుగుము ధరణి పైన
దారి చూపించు నట్టిది దార్ల మాట. (187)

చెట్టు నెప్పుడు జూడుము చింత లేక
దారి పొడవున నిచ్చును ధన్య నీడ
మంచి మనసున నడువుము మహిమ తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (188)

దీప మెప్పుడు వెలుగును దివ్య ముగను
చీక టంతయు బాపును చిత్రమగును
గర్వ మణచిన కలుగును గౌర వంబు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (189)

పాలు నీరును కలిసిన పద్ధ తిగను
కష్ట సుఖముల నుండుము కలిసి మెలిసి
మంచి మిత్రుని వీడకు మహిని నెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (190)

తేలు నెప్పుడు జూడుము తిరుగు చుండు
కుట్ట కుండను నుండదు కులము రీతి
దుష్ట బుద్ధిని వీడుము దూరు నెంత
దారి చూపించు నట్టిది దార్ల మాట. (191)

చెట్టు తనకున్న పండ్లను తింటె ఎపుడు?
నలుగు రందరి కొరకును నడచు నట్లు
పరుల మేలును గోరుము భాగ్య ముగను
దారి చూపించు నట్టిది దార్ల మాట. (192)

కప్ప బెకబెక లాడును కరువు రాగ
నీరు చూసిన వేళను నిలక డగును
తక్కువైనను పొంగుట తప్పు సుమ్ము
దారి చూపించు నట్టిది దార్ల మాట. (193)

కొండ నెప్పుడు జూడుము కోటి సార్లు
కదల కుండను నుండును గరిమ తోడ
స్థిరము గానుండు మనసున చిత్ర ముగను
దారి చూపించు నట్టిది దార్ల మాట. (194)

సాలి పురుగును జూడుము జంక కుండ
గూడు నల్లును నిరతము గొప్ప గాను
ఓట మన్నది మరచుము ఓర్పు తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (195)

ఎండ మావిని జూడగ నీరు నగును
దగ్గరైనను దొరకదు దాహ మెంత
మాయ నమ్మక బ్రతుకుము మహిని నెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (196)

నలుపు ఆవుకు కలుగును నల్ల పాలు?
తెల్ల గానుండు నెప్పుడు తెలివి తోడ
కులము కన్నను గుణమును కోర వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట. (197)

పుటము పెట్టిన పుత్తడి పొంగు నట్లు
నిప్పు లోపల కరగిన నిజము దేలు
సత్య మార్గము వీడకు సాధు గుణము
దారి చూపించు నట్టిది దార్ల మాట. (198)

బొగ్గు నంటగ నల్లనై బురద యగును
మంట లోపల వేయగా మండు చుండు
దుష్ట సాంగత్య మెప్పుడు దూర ముంచు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (199)

సింగ మెప్పుడు జూడుము జింక లెన్ని
ఉన్న నదరక గెలుచును ఊపు తోడ
ధైర్య మున్నను జయమగు ధరణి లోన
దారి చూపించు నట్టిది దార్ల మాట. (200)

సాలి పురుగును జూడుము జంక కుండ
గూడు నల్లును నిరతము గొప్ప గాను
ఓట మున్నది మరచుము ఓర్పు తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (201)

దీప మెప్పుడు వెలుగును దివ్య ముగను
తనదు వత్తిని తానెగా తగుల బెట్టు
కష్ట పడుచును వెలుగుము కాంతి తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (202)

హంస నెప్పుడు జూడుము హరిత మందు
నీరు విడిచియు పాలను నెమ్మి గ్రోలు
మంచి మాటల పలుకుము మహిని నెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (203)

ఉరుము ఉరిమిన మేఘము కురియు నొక్కొ?
గర్జ నంబులు పసలేని కార్య ములుగ
తక్కువైనను పొంగుట తప్పు సుమ్ము
దారి చూపించు నట్టిది దార్ల మాట. (204)

ఏను గెప్పుడు జూడుము హేతు వగుచు
పెద్ద దైనను నడచును పృథ్వి లోన
గర్వ మణచిన కలుగును గౌర వంబు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (205)

రాయి విసిరిన చెట్టును రాలు పండ్లు
కీడు చేసిన వానికి మేలు జేయు
ఓర్పు తోడను బ్రతుకుము ఓరి మియును
దారి చూపించు నట్టిది దార్ల మాట. (206)

చుక్క లెప్పుడు జూడుము చక్క నగుచు
దారి జారక వెలుగును ధరణి పైన
నియమ నిష్ఠలు విడువకు నెమ్మి తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (207)

తేనె టీగయు గూడెడి తేనె నెల్ల
తానె త్రాగక నొసగును ధరణి పైన
లోభి దాచిన సొమ్మును లోక మందు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (208)

వింట విడిచిన బాణము వెడలు నట్లు
నోట వచ్చిన మాటయు నొచ్చు నపుడు
మాట నిలకడ నేర్చుము మహిమ తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (209)

నీటి బుడగను జూడుము నిమిష మందు
పుట్టి గిట్టును వెనువెంట పొందు నట్లు
కాల మెప్పుడు శాశ్వతం గాదు జూడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (210)

గంధ తరువును జూడుము గరిమ తోడ
నరికి నప్పటి కైనను నయము గాను
మంచి పరిమళ మిచ్చును మహిని నెపుడు
దారి చూపించు నట్టిది దార్ల మాట. (211)

పూల తోటను జూడుము పొందు గాను
గాలి వీచిన యెప్పుడు ఘనము గాను
మంచి గంధము వెదజల్లు మహిమ తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (212)

చెరకు నెప్పుడు జూడుము చిత్ర ముగను
నలిపి నప్పటి కైనను నయము గాను
తీపి నొసగును నిరతము తెలివి తోడ
దారి చూపించు నట్టిది దార్ల మాట. (213)

ధరణి నెప్పుడు జూడుము దయను తోడ
తవ్వి నప్పటి కైనను తప్పు లేక
ఓర్పు తోడను నుండును ఓరి మిగను
దారి చూపించు నట్టిది దార్ల మాట. (214)

భరత వాక్యం
భక్తి నీతుల నింపియు భవ్య రీతి
కూర్చినట్టిది పద్యాల కోవె లనగ
చదువు వారల కెప్పుడు సౌఖ్య మిడును
దారి చూపించు నట్టిది దార్ల మాట! (215)

అంకితం:
భరత భూమిని నమ్ముచు భావ మెంచి
కలిసి మెలిసియు నుండుట ఘనత నిచ్చు
జాతి గౌరవ మెప్పుడు చాట వలెను
దారి చూపించు నట్టిది దార్ల మాట! (216)



darla mata tetageeti satakam

By: Darla Venkateswara Rao

తెలుగు సాహిత్యంలో ఛందోబద్ధమైన పద్యానికి ఎంతో విశిష్టత ఉంది. వచన కవిత్వంలో పండించినంతగా పద్యకవిత్వంలో కవిత్వం పలికించలేమనీ, సాధారణ పాఠకులకు పద్యం అందుబాటులో ఉండదనే ఒక అభిప్రాయం ఉంది. కానీ, పద్యాన్ని కూడా కవిత్వమయం చేయవచ్చునని, ప్రజల నాల్కలపై నిలిపేలా చేయవచ్చననీ ఎంతోమంది కవులు నిరూపించారు. వేమన శతకం, సుమతీశతకం వంటి పద్యాలు ఒక్క పద్యమైనా విద్యార్థులకు రాకుండా ఉండవు. అలాగే, భారతం, భాగవతం పద్యాలు కూడా నేటికీ నిత్యామృతంగానే ఆస్వాదిస్తున్నారు. ఆ కవులు పద్యాన్ని అంత బాగా రాయగలిగారు. అలాంటి పద్యాలు చదివినప్పుడల్లా ఛందోబద్ధమైన కొన్ని పద్యాలను వర్ణించాలనే కుతూహలంతో గతంలో ఆటవెలదిలో ఒక శతకం రచించి, ప్రచురించాను. ఈ సారి తేటగీతిలో నీతి ప్రబోధకమైన కొన్ని పద్యాలను వర్ణించే ప్రయత్నం చేశాను. వీటిని అందరికీ అందుబాటులోకి తీసుకొనిరావాలని డిజిటల్ ప్రచురణగా ఇలా మీ ముందుకొస్తున్నాను. ఈ పద్యాలను చదివి, దీనిలోని భావాలు విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగపడినా నా ప్రయత్నం సంపూర్ణంగా విజయవంతం అయినట్లే భావిస్తాను. పండితులైన వారు వీటిని పరిశీలిస్తే, వారిచ్చే సూచనలను ఎల్లప్పుడూ స్వీకరిస్తానని మనవి చేస్తున్నాను.

- దార్ల వెంకటేశ్వరరావు

